ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పల్నాడు జిల్లా వార్తలు

5

మంగళవారం 13 ఫిబ్రవరి 2024





వయో.. వేదన

ఏటా జనవరి 1 ఏపీపీఎస్సీ క్యాలండర్ ప్రకటిస్తాం.. ఉద్యోగాలను భర్తీ చేస్తాం.. మెగా డీఎస్సీ నిర్వహించి పెద్దసంఖ్యలో డీఎస్సీ నియామకాలు చేస్తాం.. అని అధికారంలోకి వచ్చిన జగన్ నాలుగు ఏళ్ల తొమ్మిది నెలలుగా ఆ విషయం మరిచిపోయారు. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో డీఎస్సీ ప్రకటించారు. ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం.. వయో పరిమితి పెంచి పోస్టులను భర్తీ చేయాలన్న నిరుద్యోగుల ఆవేదన అరణ్యరోదనగా మారింది. నిరుద్యోగుల ఆవేదనను అర్థం చేసుకున్న తెలంగాణ ప్రభుత్వం వయో పరిమితిని పెంచింది. ఈ క్రమంలో పక్క రాష్ట్రంలో పుట్టి ఉంటే, కనీసం అక్కడ చదువుకుని ఉంటే తమ ఆశలు నెరవేరేవనే భావనలో ఏపీలోని సీనియర్ నిరుద్యోగులు ఉన్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కాగా తాజాగా డీఎస్సీ అభ్యర్థులు కూడా వయోపరిమితి బాధితుల జాబితాలో చేరారు.

- నిరుద్యోగుల ఆవేదన అరణ్యరోదన
- వయోపరిమితి సడలింపు మంకుపట్టు
- 42 ఏళ్లకే పరిమితంపై కన్నీరు మున్నీరు
- కాళ్లా వేళ్లా పడినా కనికరించని ప్రభుత్వం
- హైకోర్టు సూచనలను పెడచెవిన పెట్టిన వైనం
- తెలంగాణలో 46 ఏళ్లకు పెంచిన రేవంత్ ప్రభుత్వం
- డీఎస్సీ అభ్యర్థుల నుంచీ వయో పరిమితిపై వినతులు
- పోటీ పరీక్షలకు అర్హత కోల్పోయిన వేల మంది నిరుద్యోగులు





సత్తెనపల్లి, ఫిబ్రవరి 12: ఒక్క ఛాన్స్.. ఒక్కఛాన్స్ అంటూ వేడుకుని జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. నిరుద్యోగులకు మాత్రం ఒక్క ఛాన్స్ ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు. వయోపరమితిని 42 నుంచి 44 ఏళ్లకు పెంచమని నిరుద్యోగులు నెలల తరబడి కాళ్లా, వేళ్లా పడి వేడుకన్నా కనికరించేది లేదు దీంతో ఆరేళ్లగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న ఉమ్మడి జిల్లాలోని వేలాదిమంది నిరుద్యోగులు అర్హత కోల్పోయారు. పరీక్షలు రాయకుండానే ఉద్యోగాన్ని పొందే అవకాశాన్ని కోల్పోయారు. తమకు ఒక్క ఛాన్స్ కూడా ఇవ్వకపోవడంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పక్కరాష్ట్రం తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరుద్యోగుల ఆవేదనను అర్థం చేసుకుని అడిగిందే తడవుగా వయో పరిమితిని 46 ఏళ్లకు పెంచారు. కానీ జగన్ మాత్రం ససేమిరా లేదు పొమ్మన్నారు. ప్రతి ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేసి రాష్ట్రంలో ఖాళీగా వున్న 2లక్షల 38వేల పోస్టుల భర్తీ చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి ఐదేళ్లగా జాబ్ క్యాలెండర్ మాటేమోగానీ, కనీసం నోటిఫికేషన్ కూడా విడుదల చేయలేదు. ఫలితంగా రాష్ట్రంలోని లక్షలాదిమంది నిరుద్యోగులు పోటీ పరీక్షల అర్హత వయసు దాటిపోయారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోనే దాదాపు 50 వేల మంది అనర్హతబారిన పడ్డారు. ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇవ్వకుండా చేసిన జాప్యానికి వయసుపెరిగి సీనియర్ నిరుద్యోగులు బలైపోయారు. కానీ ఇవేవీ పట్టించుకోని ముఖ్యమంత్రి ప్రభుత్వ పెద్దలు నిరుద్యోగులకు వయో పరిమితి సడలించేందుకు నిరాకరించారు. ఇదిలా ఉండగా తాజాగా డీఎస్సీ అభ్యర్థులు కూడా తమ వయో పరిమితిని 44 నుంచి 47కు పెంచాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. పోటీ పరీక్షల్లో ఉద్యోగం పొందేందుకు సీనియర్ నిరుద్యోగులకు ఇదే చివరి అవకాశం అవుతుంది. వయోపరిమితి దాటిపోయిన వారికి ఈసారి ఉద్యోగం పొందలేకపోతే ఇక ఉద్యోగం వచ్చే అవకాశం ఎంతమాత్రం ఉండదు. మిగిలిన వారందరికీ ఈ నోటిఫికేషన్ కాకపోతే మరో నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంటుంది. కానీ సీనియర్లకు అలా కాదు. కానీ ప్రభుత్వం ఈ అంశాన్ని మానవీయ కోణంలో కూడా ఆలోచించడానికి నిరాకరించడం నిరుద్యోగుల పాలిట పెను విషాదంగా పరిణమిస్తోంది. ఇప్పటికే నిరుద్యోగ సమస్య కారణంగా రాష్ట్రంలో 1745 మంది చనిపోయారని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వైసీపీ ప్రభుత్వ మొండి వైఖరి కారణంగా అర్హత కోల్పోయిన సీనియర్ నిరుద్యోగులపై ప్రభావం తీవ్రంగా ఉంటుంది. అయినప్పటికీ ప్రభుత్వం ఇంత మొండిగా వ్యవహరించడం వారిని కలచివేస్తోంది.

టీడీపీ హయాంలో పలుమార్లు సడలింపు

టీడీపీ ప్రభుత్వ హయాంలో పలుమార్లు వయో పరిమితిని సడలించి నిరుద్యోగులకు ఉద్యోగాలు పొందే అవకాశాలు కల్పించారు. గ్రూప్-1, గ్రూప్-2, డీఎస్సీ నోటిఫికేషన్లు రెండుసార్లకుపైగా ఇచ్చారు. వీటితోపాటు పలు శాఖల ఇంజనీరింగ్, డిగ్రీ లెక్చరర్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ తదితర పోస్టులకు టీడీపీ ప్రభుత్వం నోటిఫికేషన్లు విడుదల చేసింది. నిరుద్యోగుల పరిస్థితిని అర్థం చేసుకుని అన్ని పరీక్షలకు వయోపరిమితిని సడలించింది. కానీ ప్రస్తుత సీఎం జగన్ నిరుద్యోగుల ఆవేదనను ఏమాత్రం పట్టించుకోవడంలేదు. దీనిపై అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి వయోపరిమితి సడలించేలా సూచనలు జారీ చేసింది. వాటిని కూడా ప్రభుత్వం పట్టించుకోలేదు. పైపెచ్చు గత ప్రభుత్వాలు 36 నుంచి 42 ఏళ్లకు పెంచిన వయో పరిమితిని తాను పెంచినట్లుగా నిరుద్యోగులను వంచించేందుకు పూనుకున్నారు.

ప్రభుత్వం ఒక్కసారి ఆలోచించాలి

తెలంగాణ రాష్ట్రంలో వయో పరిమితి 46 ఏళ్ల ఉండగా, తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్లో కూడా వయో పరిమితి 44 ఏళ్లుగా ఉంది. ఈ రెండు అంశాలు చూసిన తరువాత నిరుద్యోగుల ఆవేదనకు అంతూపొంతూ లేకుండా ఉంది. అత్యధిక సంఖ్యలో ఉండే సాధారణ నిరుద్యోగులకు అవకాశం కల్పించాల్సిన ప్రభుత్వం ఇంత పట్టుదలగా ఎందుకు ఉందో కూడా వారికి అంతు చిక్కడం లేదు. పక్క రాష్ట్రాన్ని చూసైనా ఏపీ ప్రభుత్వం మరోసారి ఆలోచించాలని, తమకు ఒక్క అవకాశం కల్పించాలని వేడుకుంటున్నారు. నోటిఫికేషన్ గడువు పూర్తయినా అనుబంధ నోటిఫికేషన్‌తో తమకు మరో అవకాశం కల్పించాలని కోరుకుంటున్నారు. ఇదిలా ఉండగా డీఎస్సీ అభ్యర్థులు కూడా తమకు వయో పరిమితిని పెంచాలని విన్నవించుకుంటున్నారు.

మేమేం నేరం చేశాం?

ఏపీలో పుట్టడమే మేం చేసిన నేరమా? లేక ఒక్క ఛాన్స్ అన్నందుకు గంపగుత్తగా ఓట్లేసి గెలిపించడమా మేం చేసిన నేరమా? ఏం చేశామని మమ్మల్ని ఇంతగా వేధిస్తున్నారు? ఏం నేరం చేశామని ఇంత అన్యాయం చేస్తున్నారు. తెలంగాణలో పుట్టి ఉంటే, అక్కడ చదువుకుని ఉంటే కనీసం తమ గోడు వినిపించుకునే అవకాశమన్నా ఉండేది. ఇక్కడ మా ఆవేదనను పట్టించుకునే నాథుడే లేడు. మాలాంటి వారి ఆవేదనను అర్థం చేసుకుని తెలంగాణలో వయో పరిమితిని 46 ఏళ్లకు పెంచారు. ఇక్కడ కాళ్లా వేళ్లా పడినా పాలకులు కనికరించలేదు. హైకోర్టు సూచనలను పాలకులు పెడచెవిన పెట్టారు.

\- సీనియర్ నిరుద్యోగులు ఆవేదన

వెంటవెంటనే టెట్, డీఎస్సీ

- మార్చి 14న టెట్ ఫలితాలు, 15 నుంచి డీఎస్సీ
- ప్రభుత్వ తీరుపై నిరుద్యోగుల మండిపాటు

టెట్.. ఆ వెంటనే డీఎస్సీ.. నిర్వహణపై నిరుద్యోగ ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. ఒకే సారి రెండు పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో తెలియడం లేదని వాపోతున్నారు. టెట్‌లో ఉత్తీర్ణత సాధిస్తేనే డీఎస్సీకి అర్హత. ఉపాధ్యాయ నియామకాల్లో టెట్ మార్కులకు 20 శాతం వరకు వెయిటేజ్ ఉంటుంది. ఈ నేపథ్యంలో డీఎస్సీ అభ్యర్థులకు టెట్ కీలకం. కాని టెట్, డీఎస్సీ పరీక్షల నిర్వాహణ విషయంలో ప్రభుత్వ నిర్ణయంపై అభ్యర్థుల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. టెట్‌కు ఈ నెల 8 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కాగా 18తో గడువు ముగుస్తుంది. 27 నుంచి మార్చి 9 వరకు రాత పరీక్షలు, మార్చి 14న ఫలితాలను విడుదల చేస్తారు. ఈ నెల 18 లోగా దరఖాస్తు చేసుకుంటే 20 నుంచి మార్చి 9వ వరకు పరీక్షలు నిర్వహిస్తారు. సాధారణంగా టెట్ ఫలితాలు వెలువడిన తర్వాత డీఎస్సీ పరీక్షకు షెడ్యూల్ ఖరారు చేయాలి. రెండు పరీక్షల మధ్య నెల నుంచి 45 రోజుల వ్యవధి ఉండాలి. కాని మార్చి 14న టెట్ ఫలితాలు వెలువడిన మరుసటి రోజు అంటే 15 నుంచి డీఎస్సీ రాత పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 27న టెట్, వచ్చే నెల 15 నుంచి డీఎస్సీ నిర్వహించ నున్నారు. వేర్వేరు సిలబస్‌లు అయినందున రెండు పరీక్షల మధ్య కొంత సమయం ఉండాలని అభ్యర్థులు కోరుతున్నారు. రెండు పరీక్షల మధ్య తగినంత సమయం ఉండేలా ప్రభుత్వం షెడ్యూల్‌లో మార్పులు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



ఎఫెక్ట్

నిధులు.. నీళ్లెలా?

కోటప్పకొండ తిరునాళ్ళ ఏర్పాట్లపై సమీక్షించేందుకు ఎట్టకేలకు అధికార యంత్రాంగం స్పందించింది. కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం కలెక్టర్ శివశంకర్ అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. తిరునాళ్ల ఏర్పాట్ల ఊసేది? అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంపై ఆయన స్పందించారు. తిరునాళ్ల ఏర్పాట్లపై మొక్కుబడిగా కాకుండా నిర్దిష్ట నిర్ణయాలను సమావేశంలో తీసుకుంటే భక్తులకు మెరుగైన వసతులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది. ఈ దిశగా యంత్రాంగం స్పందించాలి. నీరు.. నిధులపై చర్చ జరగాల్సి ఉంది. ఏటా తిరునాళ్లలో నెలకొనే సమస్యలు ఈసారి పునరావృతం కాకుండా ఉండేలా చర్యలు చేపట్టే దిశగా సమీక్షించాలి. ప్రధానంగా ట్రాఫిక్, తాగునీరు, పరిశుభ్రత, భద్రత అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది.

- ఈ సారైనా ట్రాఫిక్ కష్టాలపై దృష్టి సారించాలి
- వీఐపీ పాసుల జారీపై నియంత్రణ ఉండాలంటున్న భక్తులు
- తిరునాళ్ల ఏర్పాట్లకు ప్రభుత్వం నిధులు విడుదల చేసేనా?
- కోటప్పకొండ తిరునాళ్ల ఏర్పాట్లపై నేడు సమీక్ష

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కోటప్పకొండ తిరునాళ్ల సమయంలో ఏటా ట్రాఫిక్ కష్టాలను భక్తులు ఎదుర్కొంటున్నారు. కొండకు ఉన్న ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ జామ్ అవుతోంది. గంటల కొద్దీ వాహనాలు స్తంభించిపోతున్నాయి. గత ఏడాది పెట్లూరివారిపాలెం రహదారిలో రాత్రి 10.30 గంటల నుంచి అర్ధరాత్రి 12.30 వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది. భక్తులు బస్సులు దిగి కిలోమీటర్లు నడిచి కొండకు చేరుకున్నారు. యలమదల రహదారిలో పలుమార్లు ట్రాఫిక్ స్తంభించింది. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వేలసంఖ్యలో వీఐపీ కారు పాసులు ముద్రించి పంపిణీ చేశారు. దీంతో వేలాదిగా కార్లు వచ్చాయి. దీనివలన కూడా ట్రాఫిక్ నియంత్రణ లేకుండా పోయింది. పెట్లూరివారిపాలెం రోడ్డులో వన్‌వే ఏర్పాటు చేశామని పోలీసుశాఖ ప్రకటించినా ఫలితం లేకుండా పోయింది. ఈ ఏడాది ట్రాఫిక్ ఇక్కట్లు లేని తిరునాళ్ల కోసం యంత్రాంగం ఇప్పటినుంచే చర్యలు చేపట్టాలి. ఈ దిశగా సమావేశంలో సంబంధిత అధికారులు సమీక్షించే ప్రయత్నం చేయాలి.

వేలాదిగా పాసులు జారీ..

శ్రీత్రికోటేశ్వరస్వామి దర్శనానికి వేలాది పాసులు పంపిణీ చేశారు. అధికారులు పంపిణీ చేయాల్సిన పాసులు అధికార పార్టీ కార్యాలయం నుంచి జారీ కావడంతో భక్తులు ఇక్కట్లకు గురయ్యారు. వీఐపీ పాసుతో దర్శనానికి వచ్చిన వారు కూడా రద్దీతో ఇబ్బందులు ఎదుర్కోవడంతో వారు కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికార పార్టీ నేతలు ఈ క్యూలైన్ నిర్వహించడం, అధికారులు ప్రేక్షక పాత్ర వహించడం విమర్శలకు దారితీసింది. ఈ ఏడాది కొంతమేర వీఐపీ పాసులు అధికారులు జారీ చేసేలా.. వీటిని నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలి.

తాగునీటి అవసరాలు తీర్చాలి..

తిరునాళ్ళకు తరలివచ్చే యాత్రికుల కోసం తాగునీటి వసతి కల్పించాలి. ఈ దిశగా ఇప్పటినుంచే చర్యలు చేపట్టాల్సి ఉండగా ఇందుకు జరుగుతున్న ప్రయత్నాలు లేవు. ఈ ఏడాది నీటి గండం పొంచి ఉంది. ఏటా చిలకలూరిపేట మేజర్‌కు సాగర్ నీటిని సరఫరా చేస్తారు. ఈ ఏడాది ఆ పరిస్థితులు కానరావడం లేదు. జలాశయాల్లో నీటి నిల్వలు నిండుకోవడంతో కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే సాగర్ నుంచి నీటి విడుదల చేస్తున్నారు. డ్యాంల నిర్వహణ కేఆర్‌ఎంబీ చేతుల్లో ఉంది. సాగర్ నుంచి తిరునాళ్ల కోసం నీటిని విడుదల చేయాలంటే కచ్చితంగా రివర్ బోర్డు అనుమతి తీసుకోవాల్సిందే. తాగునీటికి అవసరాలకు నీటి విడుదల షెడ్యూలును ముందుగానే ప్రకటించారు. ఏప్రిల్ నెలలో తాగునీటి అవసరాల కోసం సాగర్ నుంచి నీటిని విడుదల చేస్తారు. తిరునాళ్లకు నీటికోసం కేఆర్‌ఎంబీ అనుమతి ముందుగానే తీసుకోవాలి. ఈ అంశంపై సంబంధిత అధికారులు లేఖలు పంపాలి. యంత్రాంగం వెనువెంటనే అప్రమత్తం కావాలి. కొండ దిగువన చెరువుల్లో నీరు అడుగంటింది. దీంతో బోర్ల నీటిపైనే దేవస్థానం ఆధారపడాల్సి ఉంది. నీటి ఎద్దడి రానున్న నేపథ్యంలో రెండు బోర్లు, వాటికి రెండు మోటార్లు సిద్ధం చేయకుంటే తిరునాళ్ల రోజున నీటి సమస్య తలెత్తే అవకాశం ఉంది. నీటి అంశంపై సంబంధిత అధికారులు సమావేశంలో చర్చించి ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించాలి. దేవస్థానం అధికారులు, ఆర్‌డబ్ల్యుఎస్, జలవనరుల శాఖ అధికారుల మధ్య నీటి సరఫరాలో సమన్వయం అవసరం.

నిధులు మంజూరు చేయాలి..

తిరునాళ్ళ ఏర్పాట్లకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయాల్సి ఉంది. తిరునాళ్ళకు ప్రభుత్వం ప్రత్యేక పండుగ హోదా కల్పించింది. గత ఐదేళ్లగా ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదు. స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు మాత్రమే రూ.10 వేలు నిధులు విడుదల చేసి చేతులు దులుపుకుంటోంది. ఏటా తిరునాళ్ళ ఏర్పాట్లకు నిధుల సమస్య తలనొప్పిగా మారుతోంది. ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యుఎస్, విద్యుత్, అగ్నిమాపక, వైద్య ఆరోగ్యశాఖ, ఆర్టీసీలకు తిరునాళ్ళ సందర్భంగా జరిగే ఏర్పాట్లకు నిధులు విడుదల చేయాలి. రాష్ట్ర పండుగ హోదా కల్పించినప్పటికీ తిరునాళ్ళ నిధులపై ప్రభుత్వం నుంచి స్పష్టత లేదు. దీంతో ఆయా శాఖల అధికారులు ఏర్పాట్లకోసం నిధులు సమకూర్చుకోవటంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమీక్షా సమావేశాల్లో నిధుల సమస్యలను ప్రస్తావిస్తున్నా దీనికి శాశ్వత పరిష్కారం లభించటం లేదు. నిధుల ఇక్కట్లకు సమావేశంలో శాశ్వత పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకోవాలి.

ఎన్నికల పనులను పూర్తిచేయాలి

- శాఖల్లోని సిబ్బంది డేటా సేకరించాలి
- సమీక్షలో కలెక్టర్ శివశంకర్ ఆదేశాలు

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 12: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అవసరమైన ఫారాలను, పనులను త్వరగతిన పూర్తిచేయాలని కలెక్టర్ శివశంకర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని స్పందన హాలులో కమాండ్ కంట్రోల్ సిబ్బందితో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల్లో సంబంధిత రెవెన్యూ అధికారులతో ఎప్పటికప్పుడు సంప్రదించి ఎన్నికల పనులకు సంబంధించి పెండింగ్ శాతాన్ని తగ్గించాలన్నారు. ప్రభుత్వ శాఖల్లోని సిబ్బంది వివరాలు సేకరించి త్వరతగతిన వారి డేటాను సిద్ధం చేసి ఉంచాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో వినాయకం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అజయ్‌కుమార్, డీఎల్‌డీవో వెంకటరెడ్డి, గ్రామ వార్డు సచివాలయ అధికారి గౌసియా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

వాగునూ.. వదలరు

- ఆక్రమించి అమ్మకాలకు సిద్ధం
- రెండు విడతల్లో ఎనిమిదెకరాల ఆక్రమణ
- తప్పుడు సర్వే నంబర్లతో రిజిస్ట్రేషన్‌కు అర్జీలు

కారంపూడి, ఫిబ్రవరి 12: అధికార పార్టీ నేతల ఆక్రమణలకు అంతూపొంతు లేకుండా పోతుంది. జాగా కనిపిస్తే పాగా వేస్తున్నారు. ఆ స్థలాన్ని అమ్మేసుకుని సొమ్ము చేసుకుంటున్నారు. వీరు వాగు పోరంబోకు భూమిని సైతం వదల్లేదు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. కారంపూడి, బొల్లాపల్లి మండలాల సరిహద్దులో వినుకొండ రహదారి పక్కన ఐదెకరాల వాగు పోరంబోకు ఉంది. వైసీపీ నేతలు ఈ స్థలాన్ని ఆక్రమించుకుని చదును చేసి చుట్టూ ఫెన్సింగ్ రాళ్లను కూడా పాతారు. అంతటితో ఆగక పక్కనే ఉన్న మరో మూడు ఎకరాల పోరంబోకు భూమిని కబ్జా చేసి అందులోని పిచ్చిచెట్లను యంత్రాల సాయంతో తొలగించి అక్కడ కూడా ఫెన్సింగ్ రాళ్లను పాతారు. మొత్తంగా 8 ఎకరాల భూమిని ఆక్రమించేశారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఎకరం రూ.25 లక్షల దాకా పలుకుతుంది. తప్పుడు సర్వే నంబర్లతో రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు సదరు నేతలు రెవెన్యూ అధికారులకు అర్జీలు కూడా పెట్టుకున్నారు. అయితే అధికారులు ఈ భూమికి పట్టాలివ్వడం కుదరదని తేల్చేశారు. దీంతో గుట్టుచప్పుడు కాకుండా అమ్మకాలు జరిపేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే చాలా వరకు అమ్మేసినట్లు తెలుస్తోంది. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. దీనిపై తహసీల్దారు రమణరావును వివరణ కోరగా.. విచారించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



ఆక్రమిత భూమి



ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ రాళ్లు

17న పర్చూరుకు చంద్రబాబు

బాపట్ల, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): దుర్మార్గ వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపడమే లక్ష్యంగా టీడీపీ, జనసేన పార్టీల ఆధ్వర్యంలో రా...కదలిరా పేరిట బహిరంగసభలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. దానిలో భాగంగా ఈనెల 17న పర్చూరు నియోజకవర్గానికి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రానున్నారు. సభను పర్చూరు లేదా ఇంకొల్లు మండలంలో నిర్వహించేలా టీడీపీ నేతలు ప్రణాళికలు రచిస్తున్నారు. ఇందుకోసం అనువైన స్థలాన్ని ఎంపిక చేయడానికి సోమవారం పలు ప్రదేశాలను పార్టీ నాయకులు పరిశీలించారు. మంగళవారానికి సభ నిర్వహించే ప్రదేశంపై స్పష్టత వస్తుందని టీడీపీ నాయకులు చెబుతున్నారు.

చంద్రబాబు పర్యటనపై సర్వత్రా ఆసక్తి..

ఇటీవలకాలంలో పర్చూరు నియోజకవర్గ పరిధిలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటనపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు లక్ష్యంగా పాలకపార్టీ అక్రమకేసులను బనాయించడం ఒక ఎత్తయితే గ్రానైట్ ఫ్యాక్టరీల తనిఖీల పేరిట వైసీపీ ప్రైవేటు సైన్యాన్ని వెంటేసుకుని అధికారులు చేసిన హడావిడి విమర్శలకు తావిచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు అరెస్టవడం, బెయిల్‌పై విడుదలవడం జరిగిపోయింది. ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలోనే రా.. కదలిరా బహిరంగసభను పర్చూరు నియోజకవర్గ పరిధిలో నిర్వహించేలా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

పోటీ చేసేది మళ్లీ మేమే..

- జిల్లాలో వైసీపీ అసెంబ్లీ అభ్యర్థులను ప్రకటించిన పిన్నెల్లి

నరసరావుపేట, ఫిబ్రవరి 12: జిల్లాలో అసెంబ్లీకి పోటీ చేసే వైసీపీ అభ్యర్థుల విషయంలో పార్టీ క్యాడర్‌లో నెలకొన్న అపోహలకు ఆ పార్టీ నేతలు తెరదింపారు. మళ్లీ తామే పోటీ చేస్తున్నట్టు స్పష్టం చేశారు. కొందరు ఎమ్మెల్యేలకు తిరిగి టిక్కెట్లు ఇవ్వొద్దని కొంతకాలంగా డిమాండ్ చేస్తున్న వారి వ్యతిరేకులకు కంగు తినిపించేలా సోమవారం నరసరావుపేటలో జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పార్టీ అభ్యర్థులను ప్రకటించారు. అభ్యర్థుల విషయంలో వదంతులు రావడం సహజం, తానే సత్తెనపల్లి నుంచి పోటీ చేస్తున్నట్టు మంత్రి అంబటి ప్రకటించుకున్నారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి జిల్లాలో పోటీ చేసే వైసీపీ అభ్యర్థుల పేర్లను వెల్లడించారు. సత్తెనపల్లి నుంచి మంత్రి అంబటి రాంబాబు, మాచర్ల నుంచి తాను, వినుకొండ బొల్లా బ్రహ్మనాయుడు, పెదకూరపాడు నంబూరు శంకరరావు, గురజాల కాసు మహేష్‌రెడ్డి, నరసరావుపేట డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, చిలకలూరిపేట నుంచి మల్లెల రాజేష్‌నాయుడు వైసీపీ అభ్యర్థులుగా ఎన్నికల్లో పోటీ చేయనున్నట్టు పిన్నెల్లి తెలిపారు. మొత్తం మీద వైసీపీ టీమ్ రెడీ అయిందని ఆయన ప్రకటించడం వారిని వ్యతిరేకిస్తున్న వారికి చెక్ పెట్టినట్లయింది. అసమ్మతి నేతలు ఏవిధంగా స్పందిస్తారో చూడాలి.

7లో..

ప్రజాస్వామ్యమా.. పోలీసు రాజ్యమా?

- అక్రమ కేసులతో ఉద్యమాన్ని ఆపలేరు
- 1518వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

ఎస్టీయూ పల్నాడు జిల్లా శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక

దిక్సూచి DIKSUCHI

ఐరాసలో సంస్కరణలు
అవరోధాలు-పరిష్కారాలు

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

(నిన్నటి తరువాయి)

భారత్-భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వానికి కృషి

ప్రపంచంలో అత్యధిక జనాభా గల దేశం భారత్. పటిష్ఠ అతిపెద్ద ప్రజాస్వామ్యయుత దేశం. ప్రపంచంలో 5వ అతి పెద్ద ఆర్థికవ్యవస్థగా ఉంది. ఐక్యరాజ్య సమితి పీస్ కీపింగ్ ఫోర్స్‌లోనూ ఇతర సహాయ దళాల్లోనూ, అనేక ఒప్పందాల్లోనూ భారత్ సుదీర్ఘ భాగస్వామిగా సేవలందిస్తోంది. ఈ నేపథ్యంతోనే భద్రతామండలిలో శాశ్వత సభ్య హోదాకు కొంతకాలంగా భారత దేశం ప్రయత్నిస్తోంది. భారత్ గతంలో ఎనిమిదిసార్లు భద్రతా మండలిలో తాత్కాలిక సభ్యదేశంగా సేవలందించింది. ఆసియా-పసిఫిక్ కేటగిరీ నుంచి ఎన్నికైనప్పుడు 192కి 184 ఓట్లు సాధించింది. ఆ భారీ గెలుపు భారత్‌కు గల ప్రపంచ దేశాల మద్దతును మరోసారి ప్రతిఫలించింది. అయితే భద్రతా మండలిలో భారత్ శాశ్వత సభ్యత్వానికి పీ-5 దేశాలైన అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్ మద్దతు ప్రకటిస్తున్నప్పటికీ, చైనా అనేకసార్లు మోకాలు అడ్డుపెట్టింది.

భద్రతామండలిలో సంస్కరణల ఆవసరం

1. భద్రతామండలి ఏర్పాటైన తరవాత కేవలం 1963లో ఒక్కసారే విస్తరించారు. అది కూడా కొత్తగా నాలుగు తాత్కాలిక సభ్యదేశాలకు ఈ విస్తరింపు పరిమితమైంది. శాశ్వత సభ్యదేశాల సంఖ్యలో ఎలాంటి మార్పు లేదు.

2. భద్రతామండలి శాశ్వత సభ్య దేశాలుగా కేవలం కొన్ని ప్రాంతాలకు మాత్రమే ప్రాతినిధ్యం లభించింది. అన్ని ప్రాంతాలకు సమ ప్రాతినిధ్యం లేదు. లాటిన్ అమెరికా, ఆస్ట్రేలియా, ఆఫ్రికా వంటి కొన్ని ఖండాలకు సైతం ప్రాతినిధ్యం దక్కలేదు. అదేవిధంగా ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన భారత్, పీ-5 దేశాలతో అన్నివిధాలా సమఉజ్జీలైన జపాన్, జర్మనీ వంటి దేశాలకూ భద్రతా మండలిలో శాశ్వత స్థానం విస్తరించలేదు.

3. కేవలం రెండో ప్రపంచయుద్ధ విజేతలనే కారణంతో, అణ్వాయుధశక్తి గల దేశాలన్న స్థాయితో మాత్రమే అప్పుడు పీ-5 దేశాలకు శాశ్వత సభ్యత్వం దక్కింది. కానీ ప్రపంచ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకున్న ఇంత సుదీర్ఘకాలం తరవాత కూడా అధికారం ఆ కొద్ది దేశాల చేతిలోనే కేంద్రీకృతమవడం ఏమంత ప్రజాస్వామికం కాదు. పైగా ఇప్పటికే అవి తమ వీటో పవర్‌ను తమ స్వలాభాలకు, రాజకీయ వ్యూహాత్మక లక్ష్యాల కోసం వినియోగిస్తున్నాయి.

4. భద్రతామండలి విస్తరణ లేకపోవడం, అధికారం కేంద్రీకృతం అవడం వల్ల ప్రపంచవ్యాప్తంగా దీనికి ప్రత్యామ్నాయంగా అనేక దేశాలు కలిసి ఇప్పటికే సైనిక, ఆర్థిక, వ్యూహాత్మక సహకారాల కోసం వివిధ కూటములను ఏర్పాటు చేసుకున్నాయి. ఈ చర్యల ఫలితంగా భద్రతామండలి ప్రాబల్యం క్రమంగా తగ్గిపోయి అది ఒక క్రియాశూన్య సంస్థగా పరిణమించే అవకాశాలు లేకపోలేదు.

5. టెర్రరిజం, సైబర్ భద్రత, ప్రాదేశిక జలాలకు వెలుపల ఉన్న సముద్ర ప్రాంతంపై అజమాయిషీ, వాతావరణ మార్పులపై క్రియా విధానాలు వంటి కొన్ని నేటి ప్రధాన సమస్యలపై పటిష్ఠ విధానాలను అమలుచేయడంలో ఐక్యరాజ్య సమితి భద్రతామండలి విఫలమైంది. అత్యధిక వాతావరణ కాలుష్యానికి కారణమవుతున్న దేశాలు, సముద్రాల్లో వ్యూహాత్మకంగా ఆక్రమణ చేపడుతోన్న దేశాలు, సైబర్ దాడులను ఆయుధాలుగా వినియోగిస్తున్న దేశాలు భద్రతామండలిలో శాశ్వత సభ్యదేశాలుగా ఉండటంతో అవి తమ ప్రయోజనాలకు భంగం కలిగేలా ఎలాంటి సంస్కరణలకూ పూనుకోవడం లేదు. ఇది భద్రతామండలిలో శాశ్వత సభ్యత్వ విస్తరణ అవసరాన్ని తెలుపుతోంది.

6. చైనా వంటి శాశ్వత సభ్యదేశాలు తమ చేతుల్లో కేంద్రీకృతమైన అధికారాన్ని వదులుకోవడానికి ఇష్టపడటం లేదు. శాశ్వత సభ్యదేశాల విస్తరణను వీటో పవర్‌తో అడ్డుకుంటున్నాయి. అందువల్ల వీటో పవర్‌కు సంబంధించి సైతం కుదింపులు, సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉంది.

7. ఉత్తర-దక్షిణార్ధగోళ భౌగోళికతల పరంగానూ భద్రతామండలి శాశ్వత సభ్యత్వం కేంద్రీకృతంగానే ఉంది. దక్షిణార్ధగోళానికి ఎలాంటి ప్రాతినిధ్యం దక్కడంలేదు.

8. భద్రతామండలి శాశ్వత సభ్యదేశాలు రెండు కూటములుగా(అమెరికా దాని మిత్రదేశాలు వర్సెస్ రష్యా, చైనా)గా మోహరించి పరస్పర వ్యతిరేక ఎజెండాలను ఆశ్రయిస్తున్నాయి. అందువల్ల భద్రతామండలిపరంగా ఎలాంటి సకారాత్మక చర్యలూ పట్టాలకెక్కడంలేదు. ఈ వైరుధ్యాల స్థానంలో సహకారం, సమతౌల్యతలను తీసుకురావడానికి, బాధ్యతాయుత ప్రవర్తనకూ భద్రతామండలి శాశ్వత సభ్యత్వ విస్తరణ, వీటో అధికారాల్లో సంస్కరణ అవసరం.

భారత్‌కు శాశ్వత సభ్యత్వం వల్ల ప్రయోజనాలు

- శాంతి సామరస్యాలు కోరుకొనే భారతదేశం- ఉగ్రవాదం, అక్రమ చొరబాట్లు, అంతర్జాతీయ సముద్ర జలాల భద్రత, సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలు, ఇండో పసిఫిక్ ప్రాంతంలో చైనా ఆధిపత్య ధోరణి, కరోనా వైరస్ వంటి జీవాయుధాల సృష్టి, అంతర్జాతీయంగా కమ్ముకుంటున్న యుద్ధ పరిస్థితులు వంటి అనేక సమస్యలపరంగా భద్రతామండలి పటిష్ఠ చర్యలు తీసుకొనేవిధంగా అంతరంగిక ఒత్తిడి తీసుకురావచ్చు.
- భారత్ వంటి తటస్థ దేశం భద్రతామండలి శాశ్వత సభ్యత్వం, వీటో అధికారాలను కలిగి ఉండటం ద్వారా పీ-5 దేశాల నిర్ణయాల్లో ఆశ్రితపక్షపాతం, స్వప్రయోజనాలను నిలువరించవచ్చు.
- భారత్‌కు ప్రాతినిధ్యం దక్కడం ద్వారా ప్రపంచంలో 17.50% ప్రజలకు ప్రాతినిధ్యం దక్కినట్లవుతుంది.
- పాకిస్థాన్, చైనా వంటి సరిహద్దు దేశాల చొరబాట్లను, దుశ్చర్యలను మరింత సమర్థంగా నిలువరించే స్థాయి భారత్‌కు వస్తుంది.
- ఇప్పటికే ఐక్యరాజ్యసమితికి చెందిన అనేక ఒప్పందాల్లో, పీస్ కీపింగ్ మిషన్‌లో భాగస్వామిగా విస్తృత సేవలు అందిస్తున్న భారత్ మానవాళి సంక్షేమానికి వాటిని మరింత విస్తృతంగా చేపట్టవచ్చు.

భారత్ శాశ్వత సభ్యత్వానికి, భద్రతామండలి సంస్కరణలకు గల ప్రతిబంధకాలు

- కాంప్రహెన్సివ్ టెస్ట్ బ్యాన్ ట్రీటీ(సీటీబీటీ), న్యూక్లియర్ నాన్ ప్రొలిఫిరేషన్ ట్రీటీ(ఎన్‌పీటీ) వంటి ఒప్పందాలపై భారత్ సంతకం చేయకపోవడాన్ని చైనా వంటి దేశాలు ఒక సాకుగా చూపడం.
- భద్రతామండలికి సంబంధించి ఏ సంస్కరణలు తీసుకురావాలన్నా యూఎన్ చార్టర్ 'ఆర్టికల్ 108'లో చెప్పినవిధంగా ఐక్యరాజ్యసమితి చార్టర్‌ను సవరించాల్సి ఉంటుంది. దీని ప్రకారం ఏ సంస్కరణనైనా కనీసం 2/3వ వంతు ఐక్యరాజ్యసమితి సభ్యదేశాలు ఆమోదించాల్సి ఉంటుంది. అదేవిధంగా అన్ని శాశ్వత సభ్యదేశాలూ ఏకగ్రీవంగా ఒప్పుకోవాల్సి ఉంటుంది. ఏ ఒక్క శాశ్వత సభ్యదేశమైనా ఒప్పుకోకుండా వీటో అధికారాన్ని ప్రయోగిస్తే అలాంటి సంస్కరణలు పట్టాలకెక్కవు. కాబట్టి ఈ సంస్కరణలకు పీ-5 దేశాల వీటో అధికారం ప్రధాన అవరోధంగా ఉంది.
- అంతర్జాతీయ వ్యవహారాలు, తీర్మానాలు, ఆంక్షలు, సైనిక చర్యలపరంగా శాశ్వత సభ్యదేశాలు తమకే దత్తం అయిన ప్రత్యేక అధికారాల కట్టడికి, పంపకానికి అంగీకరించడం లేదు.
- తనకు సమ ఉజ్జీగా నిలువ గల భారత్‌కు తనతో సమానంగా శాశ్వత సభ్యదేశ హోదా, తద్వారా వీటో అధికారం లభించడం చైనాకు సుతరామూ ఇష్టంలేక భారత్ ప్రయత్నాలకు గండికొడుతోంది.



భారత్ కింకర్తవ్యం, ముందున్న ప్రత్యామ్నాయాలు

1. భారత్ సభ్యదేశంగా ఉన్న అనేక కూటముల ద్వారా భద్రతామండలి సంస్కరణల అవసరాలపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన పెంచి, ఒత్తిడి తీసుకురావడం.

2. భద్రతామండలి, ఐక్యరాజ్యసమితికి ప్రత్యామ్నాయ ప్రపంచ కూటమి దిశగా ఆలోచనలు చేస్తున్న భారత్ వంటి దేశాలు వాటిని మరింత ముందుకు తీసుకువెళ్లి ఒక సమగ్ర రూపాన్ని ఇవ్వడం. అయితే భద్రతామండలిలో సంస్కరణలు, భారత్‌కు ఇతర ఆశావహ దేశాలకు శాశ్వత సభ్యత్వం లభించడమనేది ప్రస్తుతమున్న అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో అంత సులువైన పనికాదు. శాశ్వత సభ్యదేశాల అనుచిత వర్గ ప్రయోజన చర్యలు, వ్యూహాత్మక ఎత్తుగడలకు అవి భద్రతామండలిలో తమ అధికారాన్ని వినియోగించడం(ఉదాహరణకు ఇజ్రాయెల్ - పాలస్తీనా వివాదపరంగా భద్రతామండలి ఇజ్రాయెల్‌ను నియంత్రిస్తూ చేసిన రిజల్యూషన్స్‌ను అమెరికా 16సార్లు తన వీటో అధకారం ప్రయోగించడం ద్వారా అడ్డుకుంది) ఒకటి. ఇలాంటి చర్యలను ప్రపంచ దృష్టికి విస్తృతంగా తీసుకురావడం ద్వారా, భద్రతామండలి సంస్కరణలపై ఆలోచనలు రేకెత్తి, భారత్‌కు మార్గం సుగమం అవుతుంది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో అకడమిక్ కోర్సులు



హైదరాబాద్‌లోని డా. బీ.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ(బీఆర్‌ఏఓయూ)- 2024 జనవరి సెషన్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలుగు రాష్ట్రాల్లో పలు స్టడీసెంటర్లు అందుబాటులో ఉన్నాయి.

డిగ్రీ

- బీఏ, బీకాం, బీఎస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో కోర్సు వ్యవధి మూడేళ్లు. బీఏ, బీకాం కోర్సులకు ఏదేని గ్రూపుతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీలో ప్రవేశానికి ఇంటర్(సైన్స్) గ్రూపు అభ్యర్థులు అర్హులు. ఏపీ/తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ లేదా నేషనల్ ఓపెన్ స్కూల్ నుంచి ఇంటర్ ఉత్తీర్ణులు; పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తిచేసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ మాధ్యమాల్లో ఒకటి ఎంచుకోవాలి.
- బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(బీఎల్‌ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది. దీనిని తెలుగు/ఇంగ్లీష్ మాధ్యమంలో చదువుకునే వీలుంది. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు రికార్డు అసిస్టెంట్‌గా ఏడాది అనుభవం లేదా డిప్లొమా/సర్టిఫికెట్ కోర్సు(లైబ్రరీ సైన్స్) పూర్తిచేసినవారు; ప్రొఫెషనల్ డిగ్రీ(లా/ఇంజనీరింగ్/ఫార్మసీ) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. డిగ్రీ స్థాయిలో కనీసం 50 శాతం మార్కులు ఉండాలి.

పీజీ

- ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో కోర్సు వ్యవధి రెండేళ్లు. ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంఏ(జర్నలిజం) ప్రోగ్రామ్‌లను ఆంగ్ల మాధ్యమంలో; లాంగ్వేజ్ ప్రోగ్రామ్‌లు మినహా అన్నింటినీ తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.
- **ఎంఏ స్పెషలైజేషన్‌లు:** జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, ఇంగ్లీష్, తెలుగు, హిందీ, ఉర్దూ.
- **ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు:** మేథమెటిక్స్, అప్లయిడ్ మేథమెటిక్స్, సైకాలజీ, బోటనీ, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫిజిక్స్, జువాలజీ.
- మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ (ఎంఎల్‌ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది.

పీజీ డిప్లొమా

- కోర్సు వ్యవధి ఏడాది. ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

డిప్లొమా

- కోర్సు వ్యవధి ఏడాది. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.
- **స్పెషలైజేషన్‌లు:** సైకలాజికల్ కౌన్సెలింగ్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, రైటింగ్ ఫర్ మాస్ మీడియా ఇన్ తెలుగు, హ్యూమన్ రైట్స్, కల్చర్ అండ్ హెరిటేజ్ టూరిజం, ఉమన్ స్టడీస్.

సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు

- కోర్సు వ్యవధి ఆర్నెల్లు. విభాగాన్ని అనుసరించి పదోతరగతి/ఇంటర్ ఉత్తీర్ణులు అర్హులు.
- **విభాగాలు:** ఫుడ్ అండ్ న్యూట్రిషన్, లిటరసీ అండ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్, ఎన్‌జీఓస్ మేనేజ్‌మెంట్, ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్.
- ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ కోర్సును ఇంగ్లీష్ మాధ్యమంలో, మిగిలినవాటిని తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.
- **చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **వెబ్‌సైట్:** www.braouonline.in

ఆర్‌జీఐపీటీలో ఎంబీఏ

అమేథీలోని రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం టెక్నాలజీ(ఆర్‌జీఐపీటీ)కి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్(డీఓఎంఎస్)- ఎంబీఏ, ఎంబీఏ(బిజినెస్ అనలిటిక్స్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. జాతీయ పరీక్ష స్కోర్ ఉన్నవారు, లేనివారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. నిర్దేశిత వెయిటేజీ ప్రకారం ప్రవేశాలు కల్పిస్తారు. పార్ట్ టైం ప్రోగ్రామ్, స్పాన్సర్డ్ కేటగిరీ అడ్మిషన్స్ కూడా ఉన్నాయి.

ఎంబీఏ

స్పెషలైజేషన్‌లు: ఎనర్జీ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్.

అర్హత: ప్రథమ శ్రేణి మార్కులతో పదోతరగతి, ఇంటర్, ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. క్యాట్ 2023/ జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఎక్స్‌ఏటీ) 2024/సీమ్యాట్ 2024/జీమ్యాట్ 2022/జీమ్యాట్ (2023/2024)/మ్యాట్ 2024 అర్హత పొంది ఉండాలి. ఈ అర్హత లేని పక్షంలో పదోతరగతి, ఇంటర్, డిగ్రీ స్థాయిల్లో కనీసం 65 శాతం మార్కులు ఉండాలి.

ఎంబీఏ(బిజినెస్ అనలిటిక్స్)

ఇది మల్టీ డిసిప్లినరీ ప్రోగ్రామ్. ఇందులో అనలిటికల్ టూల్స్, టెక్నిక్స్, మెథడాలజీలకు సంబంధించిన కోర్సులు ఉంటాయి.

అర్హత: ప్రథమ శ్రేణి మార్కులతో పదోతరగతి, ఇంటర్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణతతోపాటు బీఈ/బీటెక్ పూర్తిచేసి ఉండాలి. మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్ ప్రధాన సబ్జెక్టుగా బీఎస్సీ/బీకాం/బీసీఏ/బీఏ ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. క్యాట్ 2023/జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఎక్స్‌ఏటీ) 2024/ సీమ్యాట్ 2024/జీమ్యాట్ (2023/ 2023)/మ్యాట్ 2024 అర్హత పొంది ఉండాలి. ఈ అర్హత లేని పక్షంలో పదోతరగతి, ఇంటర్, డిగ్రీ స్థాయిల్లో కనీసం 65 శాతం మార్కులు ఉండాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.400; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.200
- **చివరి తేదీ:** ఏప్రిల్ 1
- **వెబ్‌సైట్:** rgipt.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/au3bWK9లో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

వీరమల్లు రాక అప్పుడే...



క్రిష్ దర్శకత్వంలో పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'హరిహర వీరమల్లు'. ఈ సినిమా చిత్రీకరణ ఆగిపోయిందంటూ కొన్ని రోజులుగా మీడియాలో వస్తున్న వార్తలకు చెక్ పెడుతూ చిత్ర నిర్మాణ సంస్థ మెగా సూర్య ప్రొడక్షన్స్ కీలకమైన అప్డేట్‌ను ఇచ్చింది. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ఫిబ్రవరి 12న విడుదల చేస్తున్నట్లు సోమవారం సోషల్ మీడియాలో ప్రకటించింది. త్వరలో ప్రోమోను కూడా విడుదల చేస్తున్నట్లు అందులో తెలిపారు. అసత్యాలు నమ్మవద్దు, భారీ హంగులు, అత్యున్నత ప్రమాణాలతో సినిమాను తీర్చిదిద్దాలనే ప్రయత్నం వల్ల చిత్రీకరణకు ఎక్కువ సమయం పడుతోంది అని మేకర్స్ పేర్కొన్నారు. ఇందులో పవన్‌కు జోడీగా నిధి అగర్వాల్ నటిస్తున్నారు. ఏఎం రత్నం సమర్పణలో ఏ. దయాకర్‌రావు నిర్మిస్తున్నారు.

యూత్ ఎంజాయ్ చేస్తారు

దర్శకుడు విఐ ఆనంద్



సందీప్‌కిషన్ హీరోగా నటించిన 'ఊరు పేరు భైరవకోన' ఈ నెల 16న విడుదల కానుంది. అనిల్ సుంకర సమర్పణలో రాజేశ్ దండా ఈ చిత్రాన్ని నిర్మించారు. కావ్య థాపర్, వర్ష బొల్లమ్మ హీరోయిన్లుగా నటించగా విఐ ఆనంద్ దర్శకత్వం వహించారు. ఆయన సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చిత్ర విశేషాలు వెల్లడించారు.

- 'టైగర్' చిత్రం తర్వాత మరో సినిమా చేయాలని నేను, సందీప్ అనుకున్నాం. నా దగ్గరున్న రెండు ఐడియాల గురించి ఆయనకు చెప్పినప్పుడు 'ఊరు పేరు భైరవకోన' కథ విని చాలా ఎక్సయిట్ అయ్యాడు. ఒక ట్రెండ్ సెట్ చేసేలా ఉంటుందని ఆ కథను ఫిక్స్ చేశాం. నిర్మాత రాజేశ్‌గారు కూడా ఈ కథ బాగుందన్నారు. మా మంచి కోరే వ్యక్తి అనిల్ సుంకర్ కూడా ఈ ప్రాజెక్ట్‌లోకి రావడంతో జర్నీ మొదలైంది. కర్మ సిద్ధాంతం, గురించి చెప్పే సినిమా ఇది. గరుడ పురాణంలోని కొన్ని అంశాలు తీసుకున్నాం.
- సినిమాలో రెండు పెద్ద ట్విస్టులు ఉన్నాయి. ప్రతి పది నిమిషాలకు ప్రేక్షకులు ఊహించని మలుపులు ఉంటాయి.

మళ్లీ మనీషా చిత్రం!

'మాయలోడు', 'రాజేంద్రుడు గజేంద్రుడు' 'యమలీల', 'వినోదం' వంటి వినోదాత్మక చిత్రాలను ప్రేక్షకులకు అందించిన మనీషా సంస్థ అధినేత కిశోర్ రాఠి చాలా కాలం గ్యాప్ తర్వాత మళ్లీ చిత్ర నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. శ్రీహర్ష, కషిక కపూర్ హీరో హీరోయిన్లుగా ఆయన నిర్మించే 'లవ్ యువర్ ఫాదర్' చిత్రం షూటింగ్ సోమవారం మల్లారెడ్డి కాలేజీలో ప్రారంభమైంది. పవన్ కేతరాజు ఈ చిత్రానికి దర్శకుడు. హీరో శ్రీహర్ష, గాయకుడు ఎస్పీ చరణ్‌పై చిత్రీకరించిన తొలి షాట్‌కు సీఎంఆర్ గ్రూప్ ఛైర్మన్ గోపాలరెడ్డి క్లాప్ ఇవ్వగా, కామకూర శాలిని కెమెరా స్విచ్‌ఆన్ చేశారు.



ఈ సందర్భంగా నిర్మాతల్లో ఒకరైన మహేశ్ రాఠి మాట్లాడుతూ 'తండ్రీకొడుకుల మధ్య ఉండే బంధాన్ని, ఎమోషన్‌ను చూపించే సినిమా ఇది. మణిశర్మగారు సంగీత దర్శకత్వం వహిస్తున్నారు. మా నాన్నగారి ఆశీస్సులతో ఈ సినిమా నిర్మిస్తున్నాను' అన్నారు.

ఇంత అద్భుతంగా నటించానా అనిపించింది

రవితేజ



'ఈగల్' చిత్రానికి ప్రేక్షకుల స్పందన చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. కాళికాదేవి ఎపిసోడ్ చూస్తుంటే నేనేనా ఇంత అద్భుతంగా నటించింది అనిపించింది' అని రవితేజ అన్నారు. ఆయన కథానాయకుడిగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించిన 'ఈగల్' చిత్రం సక్సెస్‌మీట్ ఇటీవలే జరిగింది. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ 'నాకు అవకాశం ఇచ్చిన రవితేజ గారికి ధన్యవాదాలు. ఆయన వల్లే ఇంత గొప్ప విజయం సాధ్యమైంది' అని చెప్పారు. నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ మాట్లాడుతూ 'రవితేజతో 'ధమాకా' తర్వాత 'ఈగల్'తో మరో బ్లాక్‌బస్టర్ కొట్టాం. కార్తీక్‌తో మరిన్ని సినిమాలు చేయబోతున్నాం' అని తెలిపారు.

పెగ్ కలిపారా? స్టఫ్ ఇచ్చారా?



తన వ్యక్తిత్వాన్ని కించపరిచేలా డిజిటల్ మీడియాలో వస్తున్న వార్తలపై దర్శకుడు హరీశ్ శంకర్ 'ఈగల్' సక్సెస్‌మీట్‌లో ఘాటుగా స్పందించారు. 'నేను నిర్మాత ఇంట్లో పడి రేయింబవళ్లు తాగుతున్నానంటూ, నా షాడో ఫొటో పెట్టి ఓ వెబ్‌సైట్‌లో వార్తలు రాస్తున్నారు. నేను తాగుతుంటే మీరొచ్చి పెగ్ కలిపారా? స్టఫ్ ఇచ్చారా? మీకు నిజంగా దమ్ము ఉంటే నా ఫొటో పెట్టి ఆ వార్త రాయండి. అప్పుడు నా ప్రతిస్పందన చూద్దురు. 'ఇకపైనా ఇలానే చేస్తాం' అంటే చేసుకోండి. నా వెంట్రుక కూడా పీకలేరు' అని అన్నారు.

'నాకు గ్యాప్ వచ్చిందంటున్నారు, ఇప్పుడు ఒకేసారి ఐదు సినిమాలు చేస్తున్నా. ఇవన్నీ మీకు చెప్పి చేయాలా?, మా నాన్న లాగా స్కూల్ ఫీజు కట్టావా? నీకు చూపించడానికి' అని ప్రశ్నించారు. రివ్యూల్లో విమర్శ కనిపిస్తే సరే గానీ అది హేళన స్థాయికి వెళ్లడం చూస్తుంటే బాధేస్తోందన్నారు. సినీ జర్నలిస్టులు కూడా ఇండస్ట్రీలో భాగమే, కానీ మనలో మనం కలహించుకోవడం వల్ల బయటివారికి లోకువవుతున్నామని గుర్తెరగాలి అని హరీశ్ శంకర్ హితవు పలికారు.

ఈ గడ్డ కోసం పోరాడిన వాళ్ల కథ



'ఎంతో మంది త్యాగాలు చేస్తే మనం ఈ రోజు ప్రశాంతంగా ఉన్నాం. ముఖ్యంగా సర్దార్ వల్లభ భాయ్ పటేల్ లేకపోతే మనం ఈ రోజు ఇలా ఉండేవాళ్లం కాదు. చరిత్రను ఇలా దృశ్యరూపంలో చూపిస్తే మరింత అర్థమవుతుంది. ఈ ట్రైలర్ చూస్తే రోమాలు నిక్కబొడుచుకున్నాయి. నా శిష్యుడు సత్యనారాయణ అద్భుతంగా సినిమా తీశాడు. సుద్దాల అశోక్ తేజ రక్తంతో పాటలు రాస్తారా అనిపిస్తుంది. 'రజాకార్' చిత్రం విజయం సాధించాలి' అన్నారు సీనియర్ దర్శకుడు కె.రాఘవేంద్రరావు. యాటా సత్యనారాయణ దర్శకత్వంలో గూడూరు నారాయణరెడ్డి నిర్మించిన 'రజాకార్' చిత్రం మార్చి ఒకటిన విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ను సోమవారం విడుదల చేశారు. దర్శకుడు యాటా సత్యనారాయణ మాట్లాడుతూ 'ఇటువంటి సినిమాలు తీస్తున్నప్పుడు బెదిరింపు కాల్స్, నెగెటివ్ కామెంట్స్ వస్తుంటాయి. అయినా లెక్క చేయకుండా మా చరిత్ర, మా పూర్వీకుల బాధలు, త్యాగాలు, ఈ గడ్డ కోసం పోరాడిన వాళ్ల గురించి చెప్పడానికే ఈ సినిమా తీశాను. ప్రపంచంలో అణిచివేతకు గురైన ప్రతి ఒక్కరికీ 'రజాకార్' చిత్రం అంకితం. రజాకార్లు చేసిన అన్యాయాన్ని చెప్పడానికే ఈ సినిమా తీశాం' అన్నారు. 'సెప్టెంబర్ 17 ప్రాముఖ్యం గురించి చాలా మందికి తెలీదు. మళ్లీ రజాకార్లు పుట్టొద్దు. అందుకే ఆ చరిత్రను చరిత్రగానే తీశాం. ఈ సినిమా కోసం ఎంతో ఖర్చు పెట్టాం. మూడు రెట్లు బడ్జెట్ పెరిగినా, నా ఆస్తులు అమ్మి అయినా మన చరిత్రను అందరికీ చూపించాలని 'రజాకార్' చిత్రాన్ని తీశాం' అని తెలిపారు నిర్మాత గూడూరు నారాయణరెడ్డి. ఇటువంటి చిత్రంలో నటించినందుకు ఆనందంగా ఉందని అనసూయ చెప్పారు. బాబీ సింహా, వేదిక, అనుష్య త్రిపాఠి, ప్రేమ, ఇంద్రజ, మకరంద్ దేశ్ పాండే తదితరులు నటించిన 'రజాకార్' చిత్రాన్ని తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, మరాఠి భాషల్లో విడుదల చేస్తున్నారు.

21న గోవాలో రకుల్ వివాహం

హీరోయిన్ రకుల్ ప్రీత్‌సింగ్ వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నారు. తన ప్రియుడు, నిర్మాత జాకీ భగ్నానీని ఆమె పెళ్లాడనున్నారు. వివాహ ముహూర్తం నిశ్చయమైంది. ఈనెల 21న ఈ ప్రేమజంట గోవాలో ఒక్కటవబోతున్నారు. ఆహ్వాన పత్రిక సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కొద్దిమంది కుటుంబ సభ్యులు, సన్నిహితులు మాత్రమే ఈ పెళ్లికి హాజరవుతున్నారు.



'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/muk5BeP లో చదవండి.



విలేకరుల సమావేశంలో నిందితులను, గంజాయి ప్యాకెట్లను చూపుతున్న డీఎస్పీ జనార్ధనరావు, సీఐ రమేష్‌బాబు తదితరులు

గంజాయి విక్రయించే ముఠా అరెస్టు

8 మంది నిందితుల నుంచి 3.6కేజీల గంజాయి స్వాధీనం

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 12: గంజాయిని ప్యాకెట్లలో నింపి తెనాలి, పరిసర ప్రాంతాల్లో విక్రయించే ముఠాను తెనాలి త్రీటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారని డీఎస్పీ జనార్ధనరావు తెలిపారు. సోమవారం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. స్థానిక త్రీటౌన్ పరిధిలోని రైల్వేస్టేషన్ వెనుక భాగంలో ఉన్న రైల్వే గూడ్స్ షెడ్డు వద్ద ఆదివారం సాయంత్రం కొందరు వ్యక్తులు గంజాయిని విక్రయిస్తున్నారని అందిన సమాచారంతో సీఐ రమేష్‌బాబు తన సిబ్బందితో దాడులు నిర్వహించారన్నారు. ఈ దాడుల్లో 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. మారీసుపేటకు చెందిన షేక్ నాగూరా, మందూరి ఏడుకొండలు, సిహాద్రి పూర్ణచంద్, ఐతానగర్‌కు చెందిన రాహత్ సల్మాన్, జ్యోతుల రాజ్‌పాల్, ఉప్పుతోళ్ళ స్వామి, బాలాజీపేట, మహేంద్రనగర్‌కు చెందిన బల్లం భీమరాజు, ద్వారకా నగర్‌కు చెందిన మక్కెన చంద్రకిరణ్‌లు ఒక ముఠాగా ఏర్పడి నర్సీపట్నం ఏరియా నుండి 4 కేజీల గంజాయిని రూ.10 వేలకు కొనుగోలు చేసి వాటిని తెనాలికి తీసుకురావడం జరిగిందన్నారు. వీరివద్ద నుండి సుమారు రూ.3లక్షలు విలువజేసే 3.6 కేజీల గంజాయిని, రూ.800 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. నిందితులను చాకచక్యంతో పట్టుకున్న సీఐ రమేష్‌బాబు, ఎస్ఐ వెంకటేశ్వరావు, ఇతర పోలీసు సిబ్బందిని డీఎస్పీ జనార్ధన్‌రావు అభినందించారు.

ఎస్టీయూ పల్నాడు జిల్లా శాఖ
నూతన కార్యవర్గం ఎన్నిక

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 12: రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆంధ్రప్రదేశ్ పల్నాడు జిల్లా శాఖ 77వ వార్షిక కౌన్సిల్ సమావేశం నరసరావుపేటలో జరిగిందని జిల్లా ఆర్థిక కార్యదర్శి ఏ.ఏమండి సోమవారం తెలిపారు. సమావేశంలో 2024-26 నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. పల్నాడు జిల్లాశాఖ అధ్యక్షుడుగా ఎల్‌వీ రామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి యు.చంద్రజిత్‌యాదవ్, జిల్లా ఆర్థిక కార్యదర్శిగా ఏ ఏమండి, జిల్లా గౌరవ అధ్యక్షుడుగా షేక్ కరిముల్లా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షులు, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కౌన్సిలర్లను ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏపీఎస్‌టీఎఫ్ ఆర్థిక కార్యదర్శి జోసఫ్ సుధీర్ బాబు మాట్లాడుతూ 11వ పీఆర్సీలో తీవ్ర అన్యాయం చేశారని, 12వ పీఆర్సీ కమిటీ వేసి ఆరు నెలలుగా ఐఆర్ ప్రకటించక పోవడం దారుణమన్నారు. ఎన్నికల అధికారిగా కె.సుబ్బారెడ్డి మాట్లాడుతూ సీపీఎస్, జీపీఎస్ రద్దుకై ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని అన్నారు. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి కె.కోటేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఎం సుభాని, జె.గంగాధర్‌బాబు, రాష్ట్ర కార్యదర్శి పోటు శ్రీనివాసరావు ప్రసంగించారు.. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పి.భీష్మారావు, ఎస్.రాఘవ, కె.రామలింగయ్య, వినుకొండ అక్కయ్య, టి.ఆంజనేయులు, టి.రాజాశేఖర్, సుభాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.14 లక్షలతో వీఏఏ ఉడాయింపు

నకిలీ రశీదులతో అధికారులకు బురిడి ● పోలీసులకు ఫిర్యాదు చేసిన ప్రత్తిపాడు ఏవో

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 12: ప్రత్తిపాడు మండలంలోని వంగిపురంలో ప్రభుత్వం రైతులకు అందించే సబ్సిడీ శనగ విత్తకాల అమ్మకాల్లో వీఏఏ చేతివాటం ప్రదర్శించాడు. అమ్మకాలు చేసిన శనగ విత్తనాల సొమ్ము సుమారు రూ.14 లక్షలు చెల్లించకుండా ఉడాయించారు నెల రోజులుగా గుట్టుగా జరుగుతున్న తంతు పోలీసుల ఫిర్యాదుతో బట్టబయలైంది. వివరాల్లోకి వెళితే..

వంగిపురం వీఏఏగా గత ఏడాది ఫిబ్రవరిలో పాములపాడు నుంచి డిప్యుటేషన్‌పై మేకపోతుల హరీష్‌ను నియమించారు. గత ఏడాది జూలైలో పచ్చిరొట్టి ఎరువుల గ్రామంలో అమ్మకాలు జరిపి సకాలంలో ప్రభుత్వానికి చెల్లించాడు. తరువాత ఏపీ సీడ్స్ నుంచి నవంబరులో 40 శాతం సబ్సిడీతో సుమారు రూ.17 లక్షల విలువ గల 316 క్వింటాళ్ల శనగ విత్తనాలు (రెండు రకాలు) గ్రామానికి వచ్చాయి. వీటికి సంబంధించి బ్యాంకులో సరిగా డబ్బులు జమచేయలేదు. ఆ తరువాత డిసెంబరులో తుఫాను కారణంగా దెబ్బతిన్న పంటలకు 80 శాతం సబ్సిడీతో 12.5 లక్షల విలువ గల 420 క్వింటాళ్ల శనగలు వచ్చాయి. వీటికి సంబంధించి అధికారులు వత్తిడి చేస్తున్న సమయంలో కొద్దిగా బ్యాంకులో జమచేస్తూ వస్తున్నాడు. ఈ విధంగా సుమారు రూ.14,76,484 ఏపీసీడ్స్‌కు జమ చేసినట్టు ఏపీ సీడ్స్ అధికారులు ప్రకటించారు.

అయితే.. వ్యవసాయశాఖ అధికారులు వత్తిడితో యూనియన్ బ్యాంకులో డబ్బులు జమచేసినట్టు కొన్ని నకిలీ స్లిప్పులు సృష్టించి అధికారుల దృష్టి మరల్చాడు. జనవరి 8వ తేదీ నుంచి ఫోన్లు లిఫ్ట్ చేయకుండా, వ్యవసాయశాఖ అధికారులకు కనిపించకుండా ఉడాయించాడు. అప్పటి నుంచి ప్రత్తిపాడు వ్యవసాయశాఖ అధికారులతో పాటు జిల్లా అధికారులు అతని కోసం గాలించి చివరికి ప్రయోజనం లేదని పోలీసులకు పిర్యాదు చేశారు. అతని వద్ద నుండి ఇంకా ఏపీ సీడ్స్‌కు చెల్లించాల్సింది 14లక్షల33 వేల రూపాయలుగా అధికారులు లెక్కలు తేల్చారు.

సామాన్యుడిపై పన్నుల భారం : జీవీ ఆంజనేయులు

● టీడీపీలో చేరిన 80 కుటుంబాలు





వినుకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న హనుమాన్ నగర్ వాసులు, పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న జీవీ

వినుకొండ, ఫిబ్రవరి 12: ఒక్క అవకాశం అని జగన్‌రెడ్డి నమ్మించి పేద ప్రజలను మోసం చేశాడని మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. సంక్షేమం అంటూ ఒక చేత్తో రూ.10వేలు ఇచ్చి మరో చేత్తో లక్షల రూపాయలు దోచుకున్నారని విమర్శించారు. పట్టణంలోని 29వ వార్డు హనుమాన్‌నగర్ నుంచి పాలడుగు శ్రీను ఆధ్వర్యంలో 80 కుటుంబాలు అధికార వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ముందుగా హనుమాన్‌నగర్ నుంచి పెద్దఎత్తున పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. గుంటి ఆంజనేయస్వామి గుడిలో పూజల అనంతరం జీవీ ఆంజనేయులు సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పాల చిన్న, పాలడుగు రమణయ్య, కర్నాటక దుర్గాప్రసాద్, ఎస్‌కే రహమాన్, బుజ్జి, సైదా, దాసరి రేణుక, బుజ్జమ్మ, బండారి బుజ్జి, పుల్లమ్మ, పద్మ, అంజలి, వెంకటలక్ష్మి, మరియమ్మ, ఆంజనేయులు, ఎస్‌కే బుజ్జి, ఇమామ్‌షా, బాషా, అనిల్, బాబురావులతో పాటు మరికొంతమందికి జీవీ ఆంజనేయులు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ ప్రజావ్యతిరేక ప్రభుత్వాన్ని తీవ్రంగా ఖండిస్తూ వైసీపీ నుంచి టీడీపీలో చేరడం జరిగిందని అన్నారు. అనంతరం జీవీ మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏడుసార్లు కరెంటు చార్జీలు పెంచడమే కాక మూడు సార్లు ఆర్టీసీ చార్జీలు పెంచి సామాన్యుడిపై మరింత భారాన్ని మోపారన్నారు. పేదలకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని, జగన్‌రెడ్డి వంట గ్యాస్ ధరలు పెంచడం, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడమే కాక చెత్త పన్ను అంటూ అనేక పన్నులు విధించి సామాన్య ప్రజలను దోచుకున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రజలకు చేసిన మోసాలను గుర్తించి రానున్న ఎన్నికల్లో సరైన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి షమీమ్‌ఖాన్, పట్టణ పార్టీ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, క్లస్టర్ ఇన్‌చార్జి సౌదాగర్ జానీబాషా, పల్లమీసాల దానయ్య, గంధం సుబ్బారావు, దస్తగిరి, రమణయ్య, గోవిందునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యమా.. పోలీసు రాజ్యమా?

అక్రమ కేసులతో ఉద్యమాన్ని ఆపలేరు ● 1518వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు



వెంకటపాలెం ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్లూరు ఫిబ్రవరి 12: మూడు రాజధానులంటూ మోసం చేసిన వైసీపీ ప్రభుత్వంపై తాము శాంతియుత మార్గంలో అమరావతే రాష్ట్రానికి ఏకైక రాజధాని అని ఉద్యమం చేస్తుంటే అక్రమ పోలీసు కేసులతో ఉద్యమాన్ని ఆపాలని చూస్తోందని రాజధాని అమరావతి నిర్మాణానికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు మహిళలు చేస్తున్న ఆందోళనలు సోమవారం నాటికి 1,518వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు ధర్నా శిబిరాల నుంచి మాట్లాడుతూ, మూడుముక్కల ఆటతో సీఎం జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని అతలాకుతలం చేశాడన్నారు. చేసిన తప్పును సరిదిద్దుకొని అమరావతి అభివృద్ధిని కొనసాగించాలన్నారు. హైకోర్టు తీర్పును అమలు చేసి మూడు రాజధానుల ముచ్చటను శాశ్వతంగా మూసేయాలన్నారు. అప్పులు తప్పితే రాష్ట్రంలో ఎక్కడా ప్రగతి కనబడటం లేదన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలతో పాటు తాడికొండ, మంగళగిరి నియోజకవర్గాలలో రైతుల ఆందోళనలు కొనసాగాయి.

ఇన్‌స్పైర్ ప్రదర్శనలతో విద్యార్థుల సృజనాత్మకతకు పదును

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 12: విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే ఇన్‌స్పైర్ ప్రదర్శనల లక్ష్యమని డిప్యూటీ డీఈవో పి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక గుంటూరు పాత బస్టాండ్ వద్ద ఉన్న ప్రభుత్వ ఉర్దూ హైస్కూల్‌లో బాపట్ల, గుంటూరు జిల్లాల విద్యార్థులకు నిర్వహించిన ఇన్‌స్పైర్ ప్రదర్శనను ప్రారంభించి ఆయన మాట్లాడారు. విద్యార్థి దశలోనే వారి సృజనాత్మకతకు పదునుపెట్టేలా విజ్ఞానంపై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. తెనాలి డిప్యూటీ డీఈవో ఎం.నిర్మల ప్రసంగిస్తూ జిల్లాస్థాయి వైజ్ఞానిక, ఇన్‌స్పైర్ ప్రదర్శనలో విద్యార్థులు పాల్గొని వారి మెదడుకు పదును పెట్టుకోడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్, ఢిల్లీ ప్రతినిధి కృష్ణ జస్విన్, డీసీఈబీ సెక్రటరీ లలిత్ ప్రసాద్, ఉర్దూ డీఐ ఖాసిం, సైన్స్ అధికారులు అడుసుమల్లి రవికుమార్, మహమ్మద్ సాదిక్, సైన్స్ కోఆర్డినేటర్లు గౌసుల్ మీరా, పవని భానుచంద్రమూర్తి, సికిందర్ మీర్జాన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రదర్శనలు ఇవే..

గౌరుబోయిన యశస్వి శివసాయి (చేబ్రోలు మండలం. కొత్తరెడ్డిపాలెం కేజీ హైస్కూల్), డి.పీసపాటి మస్తాన్‌రావు (సిరిపురం జిల్లా పరిషత్ హైస్కూల్), షేక్ సనా బుష్రా (నేతాజీ నగర్ మున్సిపల్ హైస్కూల్ పొన్నూరు), వరగాని తోమరాజు (జడ్పీస్కూల్ గొట్టిపాడు), కొచ్చర్ల శిరీష (జడ్పీ స్కూల్ ముట్లూరు). బాపట్ల జిల్లా నుంచి.. సంపతి అమూల్య (జడ్పీస్కూల్, బల్లికురవ), చిరతనగండ్ల అమూల్య (జడ్పీస్కూల్, పావులూరు), చదువుల సింధుజ(జడ్పీస్కూల్, జంపని), ఎల్లల వైష్ణవి (శ్రీ ప్రకాశం గవర్నమెంట్ హైస్కూల్ అద్దంకి) తదితరులు ఈనెల 18న చిత్తూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు.



దక్షిణ మధ్య రైల్వే జీఎం నిర్వహించిన వీసీకి హాజరైన డీఆర్ఎం రామకృష్ణ

భద్రత, పరిశుభ్రతకు ప్రాధాన్యం

● దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్

గుంటూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో భద్రత ఎంత ముఖ్యమో పరిశుభ్రత కూడా అంతేనని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ స్పష్టం చేశారు. సోమవారం ఆయన సికింద్రాబాద్ హెడ్‌క్వార్టర్స్ నుంచి వివిధ అంశాలపై గుంటూరు డీఆర్ఎం ఎం రామకృష్ణతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రైళ్లలో పరిశుభ్రత నిర్వహణపై దృష్టి సారించాలని సూచించారు. రైళ్లలో పరిశుభ్రత వ్యవస్థ ప్రమాణాలను మెరుగుపరచాలన్నారు. జోన్‌లో పొగను గుర్తించే పరికరాలను, అగ్నిమాపక సామగ్రి తదితర భద్రతకు సంబంధించిన సామగ్రి లభ్యతపై అధికారులు జనరల్ మేనేజర్‌కు సమాచారాన్ని అందించారు. అనుకోని ప్రతికూల పరిస్థితులు ఎదురైతే అత్యవసర సామగ్రిని డిపోల్లో సరిపడా నిల్వలు ఉంచాలని ఆదేశించారు.

ప్రాజెక్టు ఈఈగా బీఎస్ సుబ్రహ్మణ్యం



ఈఈ బీఎస్ సుబ్రహ్మణ్యాన్ని సన్మానిస్తున్న ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరమణ తదితరులు

రెంటచింతల, ఫిబ్రవరి 12: సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు ఈఈ(సివిల్)గా బీఎస్ సుబ్రహ్మణ్యం సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆయన విజయవాడ విద్యుత్ సౌదా నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి దాకా శ్రీశైలం కుడిగట్టుకు చెందిన రమేష్‌కుమార్ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అందరి సహకారంతో తన విధులను చిత్తశుద్ధితో నిర్వహిస్తానన్నారు. కార్యక్రమంలో ఈఈ నాగరాజు, ఏడీఈలు మహ్మద్, గిరిబాబు, జయశంకర్, ఫోర్‌మెన్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో పలు అభివృద్ధి పనులకు ఆమోదం

గుంటూరు (మెడికల్), ఫిబ్రవరి 12: ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో ఆరేళ్లగా నిలిచిపోయిన సర్వీస్ బ్లాక్ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, సంబంధిత ఏపీ ఎంఎస్ఐడీసీ ఇంజనీరింగ్ విభాగాన్ని ఆదేశించారు. సోమవారం జీజీహెచ్ సూపరింటెండెంట్ ఛాంబర్‌లో ఆయన ఆసుపత్రి అభివృద్ధిపై సమీక్ష జరిపారు. సర్వీస్ బ్లాక్ నిర్మాణం ఆగిపోయినట్లు సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ తెలుపగా, స్పందించిన కృష్ణబాబు, ఏపీ ఎంఎస్ఐడీసీ (మంగళగిరి) ఎండీ మురళీధర్‌రెడ్డిని ఫోన్‌లో సంప్రదించి గుంటూరు జీజీహెచ్‌లో సర్వీస్ బ్లాక్ పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సర్వీస్ బ్లాక్ నిర్మాణం పూర్తి అయితే ఇందులో స్టీమ్ లాండ్రీ, కిచెన్, ఫార్మసీ స్టోర్, సీటీ స్కాన్ మెషిన్ రూమ్ అందుబాట్లోకి వస్తాయి. కాన్పుల వార్డులో మరామ్మతుకు గురైన లిఫ్ట్‌ను రిపేరు చేయించేందుకు కృష్ణబాబు నిధులు విడుదల చేసేందుకు ఆమోదం తెలిపారు. పొదిల ప్రసాద్ బ్లాక్‌పై అదనంగా మరో రెండు అంతస్తులు నిర్మించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

నాట్కో కేన్సర్ సెంటర్‌లో అదనంగా వంద పడకలు

● ప్రభుత్వం, నాట్కో మధ్య కుదిరిన ఒప్పందం

గుంటూరు (మెడికల్), ఫిబ్రవరి 12: ప్రభుత్వ సమగ్రాస్పత్రి నాట్కో కేన్సర్ సెంటర్ ఆసుపత్రికి 1800 అడుగుల స్థలం కేటాయిస్తూ, అందులో 100 పడకలను ఏర్పాటు చేసేందుకు వీలుగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ, నాట్కో ట్రస్ట్ మధ్య ఒప్పందం కుదిరింది. సోమవారం గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో జరిగిన కార్యక్రమంలో ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు చేతుల మీదుగా నాట్కో ట్రస్ట్ సమన్వయకర్త వై అశోక్‌కుమార్ ఎంవోయూ పత్రాలు అందుకున్నారు. ఆరోగ్య శాఖ, నాట్కో ట్రస్ట్ మధ్య కుదిరిన ఒప్పందంతో, ప్రస్తుతం ఈ స్థలంలో ఉన్న స్టీమ్ లాండ్రీతో పాటు పలు విభాగాలను కొత్తగా నిర్మించే సర్వీస్ బ్లాక్‌లోకి మారుస్తామని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు.

సమ్మె ఒప్పందాలు అమలు చేయాలి

ఐసీడీఎస్ పీడీ ఉమాదేవికి అంగన్‌వాడీల వినతి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 12: అంగన్‌వాడీల సమ్మె విరమణ సందర్భంగా చేసిన ఒప్పందం ప్రకారం సమ్మె కాలం జీతం సహా అన్ని జీవోలను వెంటనే విడుదల చేయాలని ఏపీఅంగన్వాడీ వర్కర్స్ అండ్‌హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి దీప్తి మనోజ కోరారు. ఈ మేరకు సోమవారం ఐసీడీఎస్ ఉమాదేవి, గుంటూరు అర్బన్ సీడీపీవో కృష్ణవేణిలకు అంగన్‌వాడీలతో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం దీప్తిమనోజ మాట్లాడు తూ అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలో అంగన్‌వాడీల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని సమస్యను ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో యూనియన్ నాయకులు ముత్యాలరావు, రాధా, చినవెంకాయమ్మ, షేక్ బాజీ తదితరులు ఉన్నారు.



పార్టీలో చేరిన వారితో మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

నయవంచనకు బ్రాండ్ అంబాసిడర్ జగన్

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 12: ముఖ్యమంత్రి జగన్ నమ్మకానికి కాదు, నయవంచనకు బ్రాండ్ అంబాసిడర్ అని మాజీమంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు ధ్వజమెత్తారు. పట్టణంలో 30వ వార్డుకు చెందిన పలువురు ముస్లిం యువకులు సోమవారం టీడీపీలో చేరారు. టీమ్ ఆఫ్ హార్స్ గ్యారేజ్‌కి చెందిన వందమంది యువకులు ప్రత్తిపాటి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారిని ప్రత్తిపాటి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత కుటుంబసభ్యుల నుంచి సాధారణ కార్యకర్తల వరకు ఆ విషయం బోధపడటంతోనే వైసీపీలో ఎవ్వరూ ఇమడ లేకపోతున్నారని ప్రత్తిపాటి ఎద్దేవ చేశారు. జగన్ పాలనలో ఇటు ప్రజలు కాని, అటు వైసీపీ పార్టీలో గాని ఎవ్వరూ సంతృప్తిగా సంక్షేమంతో లేరని, కేవలం జగన్ అతని కోటరీలో కొందరు మాత్రమే వేల కోట్లు వెనకేసుకుంటున్నారన్నది బహిరంగ రహస్యమన్నారు. ఈ పరిస్థితుల్లోనే గత ఎన్నికల్లో పార్టీ కోసం ఆస్తులు అమ్ముకున్నవారు, వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అప్పులు తీసుకువచ్చి పనులు చేసిన వారు ఇప్పుడు దిక్కుతోచని స్థితిలో పడ్డారన్నారు. వారందరినీ గాలికి వదిలి వేసి జగన్ తన స్వార్థం తాను చూసుకుంటున్నారని, ఈ పరిస్థితుల్లో ఏం చేయాలో పాలుపోక అనేక మంది వివిధ విపక్ష పార్టీలో చేరుతున్నారన్నారు.



టీడీపీలో చేరిన సుద్ధపల్లి వాసులతో నరేంద్ర కుమార్

వైసీపీని సాగనంపేందుకే
టీడీపీ, జనసేన పొత్తు

చేబ్రోలు, ఫిబ్రవరి12: ఐదేళ్లుగా అరాచక పాలనకు సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపేందుకే టీడీపీ, జనసేన పొత్తు అని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. మండలంలోని సుద్దపల్లి గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు సోమవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. వైసీపీ ఎంపీటీసీ మట్టుపల్లి వెంకటేశ్వరరావు, తోట శ్రీనివాసరావు, నల్లనూకల గోవింద్, నల్లనూకల వెంకటేశ్వరరావు, దానబోయిన శ్రీనివాసరావు, కానుల నవీన్, పిల్ల నవీన్ తదితర వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. వీరికి నరేంద్రకుమార్ పార్టీ జెండా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో నరేంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ పాలనలో గ్రామాలు అధోగతి పాలయ్యాయన్నారు. సుద్దపల్లి గ్రామానికి తాగు, సాగు నీరు అందించే ఎత్తిపోతల పథకాన్ని నిరుపయోగంగా మార్చిన ఘనత వైసీపీ పాలకులది అన్నారు. దోపిడి తప్ప ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోవటం లేదని ధ్వజమెత్తారు. ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి ఎన్నికల తర్వాత ఆయా వర్గాలను పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం ప్రజల సంక్షేమం కోసం టీడీపీ, జనసేన పార్టీలను గెలిపించాలన్ని నరేంద్ర కుమార్ విజ్ఞప్తి చేసారు. నూతనంగా పార్టీలో చేరిన వెంకటేశ్వరరావు తదితరులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు షైలా వెంకట రామరాజు, అనంత లక్ష్మీనారాయణ, వీరంకి రంగారావు, తదితర టీడీపీ నాయకులతో చందోలు శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

ఏపీసీసీ ఎన్నికల కమిటీలో పలువురికి స్థానం

గుంటూరు, ఫిబ్రవరి 12: ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల చైర్మన్‌గా పలువురు సీనియర్ నేతలతో ఏపీసీసీ ఎన్నికల కమిటీని నియమించింది. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తగా నియమించిన ఏపీసీసీ ఎన్నికల కమిటీలో పలువురు జిల్లా నేతలకు స్థానం కల్పించటం విశేషం. జిల్లాకు చెందిన కేంద్ర మాజీమంత్రి జేడీ శీలం, ఏఐసీసీ కార్యదర్శి గారా ఉషారాణి, మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి, ఉడా మాజీ చైర్మన్ వణుకూరి శ్రీనివాసరెడ్డి, ఏపీసీసీ నాయకుడు సూర్యానాయక్‌లకు స్థానంకల్పించారు. ఎక్స్‌అఫిషియో సభ్యులుగా కాంగ్రెస్ అనుబంధ విభాగాల అధ్యక్షులు కొనసాగనున్నట్లు పేర్కొన్నారు. త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాల్లో పార్లమెంటు, అసెంబ్లీ స్థానాలకు టికెట్ల కేటాయింపులపై ఈ కమిటీ సభ్యులు సమీక్షించనున్నట్లు తెలిపారు. ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి మద్దిరెడ్డి జగన్మోహన్‌రెడ్డికి బాపట్ల ఇన్‌ఛార్జ్‌గా, ఇతర నేతలకు కూడా నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించారు.

ఆరు రైళ్ల దారి మళ్లింపు, పాక్షిక రద్దు

గుంటూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): నంద్యాల మార్గంలో నాన్ ఇంటర్ లాకింగ్, రోల్ కారిడార్ బ్లాక్ పనుల కారనంగా ఆరు రైళ్లను దారి మళ్లిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో సీహెచ్ రాకేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 25 నుంచి 28వ తేదీ వరకు మచిలీపట్నం - ధర్మవరం, మార్చి 26 నుంచి 29వ తేదీ వరకు ధర్మవరం - మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌లను విజయవాడ నుంచి తెనాలి, రేణిగుంట, పాకాల మీదగా మళ్లించడం జరుగుతుందన్నారు. అలానే మచిలీపట్నం - యశ్వంత్‌పూర్ కొండవీడు ఎక్స్‌ప్రెస్‌ని మార్చి 25, 27 తేదీల్లో, యశ్వత్‌పూర్ - మచిలీపట్నం కొండవీడు ఎక్స్‌ప్రెస్‌ని మార్చి 26, 28 తేదీల్లో తెనాలి, రేణిగుంట, మేలపాకం క్యాబిన్, జోలార్‌పెట్టాయి మీదగా మళ్లిస్తామన్నారు. హౌరా - సత్యసాయి ప్రశాంతి నిలయం ఎక్స్‌ప్రెస్‌ని మార్చి 27న, శ్రీసత్యసాయి ప్రశాంతి నిలయం - హౌరా ఎక్స్‌ప్రెస్‌ని మార్చి 29న గూడూరు, రేణిగుంట, తిరుపతి, పాకాల, ధర్మవరం వరకే నడపడం జరుగుతుందని, అలానే తిరుగు ప్రయాణం ధర్మవరం నుంచి ప్రారంభించడం జరుగుతుందన్నారు.

కృష్ణానదిలో విద్యార్థి మృతదేహం

అచ్చంపేట, ఫిబ్రవరి 12: వేల్పూరు ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి బత్తుల గణేష్(15) మృతి చెందాడు. శనివారం సాయంత్రం ద్విచక్ర వాహనం తీసుకుని ఇంటి నుంచి వెళ్లాడు. ఎంతకీ తిరిగి రాక పోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు సోమవారం ఉదయం సమాచారం అందించారు. అనంతరం గణేష్ ద్విచక్ర వాహనం చామర్రులోని కృష్ణా నది వద్ద కన్పించటంతో అనుమాన పడిన బంధువులు కృష్ణా నదిలో వెతికి గణేష్ మృతదేహాన్ని వెలికి తీశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

1,36,885టిక్కీల విక్రయం

గుంటూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మిర్చి యార్డుకు సోమవారం 1,47,072 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,36,885 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవ సాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకు మాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 89,923 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.33 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	138, 147,158
చికెన్ విత్ స్కిన్	264.00
చికెన్ స్కిన్ లెస్	274.00

పల్నాడు వార్తలు

వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు



పార్టీలో చేరిన వారితో జూలకంటి బ్రహ్మారెడ్డి

మాచర్ల, ఫిబ్రవరి 12: మండలంలోని జమ్మలమడకకు చెందిన రెడ్డి, కాపు సామాజికవర్గాల వైసీపీ నేతలు సోమవారం ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి వీరికి పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ ప్రజా కంటక పాలన సాగిస్తున్న వైసీపీని రాష్ట్రం నుంచి తరిమికొట్టేందుకు కలిసి వస్తున్న వారందరినీ సాదరంగా ఆహ్వానిస్తున్నామన్నారు. ప్రజలను బానిస సంకెళ్ల నుంచి పోరాడేందుకు తాను పోరాడుతున్నట్లు చెప్పారు. ఈ పోరాటానికి యువత, మహిళలు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గంపూడి అంజిరెడ్డి, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 12: పట్టణంలోని 17, 22 వార్డులకు చెందిన వైసీపీ కుటుంబాలు సోమవారం ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి వీరికి పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు దుర్గారావు, మంజుల అంజి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్ష, కార్యదర్శులుగా రాఘవ, సదాశివారెడ్డి



రాఘవ, సదాశివరెడ్డి

క్రోసూరు, ఫిబ్రవరి 12 : ఎస్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా క్రోసూరు మండలానికి చెందిన సాతులూరి రాఘవ, జిల్లా కార్యదర్శిగా జీ సదాశివరెడ్డి ఎన్నికయ్యారు. వీరిద్దరు మండలంలోని 88 తాళ్ళూరులోను, దొడ్లేరులోను పని చేస్తున్నారు. యూనియన్ సీపీఎస్ జిల్లా కన్వీనర్‌గా టీ శరత్‌కుమార్, జిల్లా కౌన్సిలర్లుగా కూరాకుల శ్రీనివాసరావు, వైఆర్‌కే ప్రసాదు, ధర్మారావు, దొప్పలపూడి వెంకటేశ్వరరావు, ఎస్‌కే మజీద్, డీ పోతయ్య, సీహెచ్ ఉమ ఎన్నికయ్యారు. కన్వీనరుగా టీ శేషలత ఎన్నికయ్యారు.

భూ హక్కు యాజమాన్య చట్టంను రద్దు చేయాలి

సత్తెనపల్లి, ఫిబ్రవరి 12: ఆంధ్రప్రదేశ్ భూమి హక్కుల యాజమాన్య చట్టంను వెంటనే రద్దు చేయాలని కోరుతూ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మారూరి లింగారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం న్యాయస్థాన ప్రాంగణంలో ఉన్న న్యాయదేవత విగ్రహం వద్ద రిలే దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ ఈ చట్టం అమలు జరిగితే సామాన్య మధ్య తరగతి ప్రజలు, సన్న కారు రైతులు తీవ్రంగా నష్ట పోతారన్నారు. ఇలాంటి నల్ల చట్టాలను రద్దు చేయాలని న్యాయవాదులు నినాదాలు చేశారు. దీక్షల్లో న్యాయవాదులు కాకర్ల హరిబాబు, రాజశేఖరుని గోపాలకృష్ణ మూర్తి, పీ పాపారావు, రామిరెడ్డి, బీ కోటేశ్వరరావు, ఉన్నం నయన, కే సాయి, చలువాది చిన సత్య నారాయణ, చిట్టా విజయ భాస్కర్‌రెడ్డి, దేవినేని దస్తగిరిరావు, దివ్వెల శ్రీనివాసరావు, చిలుకా చంద్రశేఖర్, బత్తుల ఆదినారాయణ, నరిచేటి వేణుగోపాల్, బత్తిన శ్రీనివాసబాబు తదితరులు పాల్గొన్నారు. న్యాయవాద గుమస్తాలు పాల్గొని మద్దతు తెలిపారు.


విధులు బహిష్కరించిన న్యాయవాదులు

మాచర్ల, ఫిబ్రవరి 12: గురజాల కోర్టు న్యాయాధికారి షర్మిల ఆకస్మిక మృతికి సోమవారం మాచర్ల కోర్టు న్యాయాధికారి, న్యాయవాదులు సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కోర్టు విధులను బహిష్కరించారు. షర్మిల మృతికి శాంతి చేకూరాలని రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జూపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి శ్రీనివాస రెడ్డి, నాగిరెడ్డి, గట్ల సత్యనారాయణరెడ్డి, నరసింహారావు, కృష్ణమూర్తి, రమేష్ బాబు, రాంనాయక్, మస్తాన్‌ఖాన్, జోజి, శేషిరెడ్డి పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహకం : ఏపీవో

రెంటచింతల, ఫిబ్రవరి 12: 2024-25 సంవత్సరాల్లో మండలంలోని వివిధ గ్రామాల్లో 200 ఎకరాల్లో పండ్ల తోటలను సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకుని ఆ మేరకు ప్రణాళికలు రూపొందించినట్లు ఉపాధిహామీ ఏపీవో జయచంద్ర చెప్పారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ గ్రామాల సర్పంచులు, క్షేత్ర సహాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జామ, నిమ్మ, బత్తాయి, కొబ్బరి, మామిడి తోటలను సాగు చేసినట్లయితే ఎకరాకు మూడు సంవత్సరాల వరకు రూ.1.50 లక్షల సబ్సిడీ ఇస్తామన్నారు. ఒక్కో ఎకరాకు 444 మొక్కలు అవసరమవుతాయన్నారు. ఎంపీడీవో శంకర్ మాట్లాడుతూ స్థిరమైన ఆదాయం పొందడానికి పండ్ల తోటల సాగు మంచిదన్నారు. ఈ సమావేశంలో ప్లాంటేషన్ అసిస్టెంట్, సర్పంచులు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

పీఎంజేబీవైను వినియోగించుకోవాలి : సీజీజీబీ మేనేజర్



మృతుడి కుటుంబసభ్యులకు చెక్కును అందజేస్తున్న సీజీజీబీ మేనేజర్ కిషన్

ముప్పాళ్ళ ఫిబ్రవరి 12: ప్రధానమంత్రి జీవనజ్యోతి బీ మా యోజన (పీఎంజేబీవై) ను వినియోగిం చుకోవాలని చై తన్య గోదావరి గ్రామీణ బ్యాం కు మేనేజర్ కిషన్ అన్నారు. మండలంలోని చాగంటివారి పాలెంలో ఇటీవల మృతి చెందిన జయసింహారెడ్డి భార్య అశ్వనీకి సోమవారం పీఎంజేబీవై కింద రెండు లక్షల చెక్కును బ్యాంకు మేనేజర్ కిషన్ అందజేశారు.

ఆలయానికి 50 బస్తాల ధాన్యం బహూకరణ



ఆలయానికి 50 బస్తాల ధాన్యం వితరణ చేస్తున్న ఓర్సు ఆనంద్ తదితరులు

బెల్లంకొండ, ఫిబ్రవరి 12: బెల్లంకొండ మండలంలోని చంద్రాజుపాలెం గ్రామానికి చెందిన నరసరావుపేట పార్లమెంట్ టీడీపీ బీసీ ప్రధాన కార్యదర్శి ఓర్సు ఆనంద్ గ్రామంలో గల వెంకటేశ్వర స్వామి ఆలయానికి 50 బస్తాల ధాన్యాన్ని బహూకరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఓర్సు ఆనంద్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ సూచనలతో ఆలయానికి ధాన్యాన్ని బహూకరించినట్టు పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం స్వామి వారి కల్యాణానికి ధాన్యం బస్తాలను అందిస్తున్నట్టు తెలిపారు. ఈ ధాన్యాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేసినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు లక్ష్మయ్య, రాజేష్, బ్రహ్మయ్య, ఉప్పు సుబ్బారావు, వెంకటేశ్వర రావు, రాంబాబు, నాగరాజు, శ్రీనివాసరావు, కొండలు, జయ, వడ్డెర సంఘం పెద్దలు పాల్గొన్నారు.

యువతను నమ్మించి జగన్ మోసం

● టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ

● పార్టీలో చేరిన పలువురికి కండువాలు కప్పి ఆహ్వానం



కన్నా కార్యాలయంలో టీడీపీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఫిబ్రవరి 12: ప్రజాస్వామ్యంలో ఓటు ద్వారా నాయకులను ఎన్నుకుంటామని టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని టీడీపీ ప్రజావేదికలో సోమవారం ఫస్ట్ ఓటు ఫర్ సీబీఎన్ కార్యక్రమం కన్నా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కన్నా లక్ష్మీనారాయణ ఓటు ఎందుకు వేయాలనే విషయాన్ని కార్యక్రమానికి హాజరైన వారికి వివరించారు. ఓటు రాష్ట్ర భవిష్యత్తుకు ఉపయోగపడాలన్నారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 2019లో యువతను నమ్మించి మోసం చేశారన్నారు. డిగ్రీలు పూ ర్తి చేసుకున్న యువత ఉద్యోగాలు వెతుక్కుంటూ పొరుగు రాష్ట్రాలకు వెళ్లకుండా ఉండాలంటే నారా చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. యువతకు ఇంకా పలు అంశాల గురించి ఆయన వివరించారు. కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన టీడీపీ నేత మన్నెం శివనాగమల్లేశ్వర రావు, చిన్నబోయిన రాఘవయాదవ్, టీ సుధాకరరెడ్డి, వక్కంటి అజయ్ కుమార్‌లను ఆయన అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు నూర్‌బాషా జాన్‌బాబు, ఆళ్ళ అమరేశ్వరరావు, పల్లపాటి పెద్దిరాజు, కటకం రామకృష్ణ, ఆతుకూరి నాగేశ్వరరావు, నాగం కార్తీక్, మన్నవ శారదాదేవి, షేక్ వలి తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తు తెలుగుదేశం పార్టీదే

భవిష్యత్తు తెలుగుదేశం పార్టీదేనని, టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావటం ఖాయమని టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని 28వ వార్డుకు చెందిన 15 రజక కుటుంబాలు సోమవారం టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. వీరందరికీ కన్నా కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ నేతలు దూపగుంట్ల జానకి రామారావు, గుంటూరు ఆశీర్వాదం, సర్వేపల్లి వెంకటరావు, షేక్ బాబు ఆధ్వర్యంలో 15కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో 28వ వార్డు టీడీపీ అధ్యక్షుడు షేక్ సైదా, టీడీపీ నేతలున్నారు.

రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని 22వ వార్డులో సోమవారం సాయంత్రం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి తిరిగి టీడీపీ మినీ మేనిఫెస్టోలోని పథకాల గురించి ప్రజలకు వివరించారు. జనసేన, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే చేపట్టబోయే సంక్షేమ పథకాల గురించి వివరించారు. సైకో పాలనకు చరమగీతం పాడాల్సిన అవసరం ఉందన్నారు. వార్డులోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు కన్నాకు హారతి ఇచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ యేల్లినేడి రామస్వామి, నాయకులు ఆతుకూరి నాగేశ్వరరావు, నూరుబాషా జానీబాబు, యేల్లినేడి లక్ష్మీతులసి, పోట్ల ఆంజనేయులు, బోడెంపూడి రాజేశ్వరి, బండారు నాగరాజు పాల్గొన్నారు.

ఆదాం మృతి బాధాకరం

సత్తెనపల్లి రూరల్, ఫిబ్రవరి 12 : మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పురం ఆదాం మృతి బాధాకరమని కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని గర్నెపూడికి చెందిన పురం ఆదాం ఇటీవల మృతి చెందారు. ఆయన పెద కర్మలో సోమవారం కన్నా పాల్గొన్నారు. ఆదాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆదాం కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆళ్ళ అమరేశ్వరరావు, కోడెల శివరామ్, కోమటినేని శ్రీనివాసరావు, గుంటూరు ఆశీర్వాదం, బొక్కా సంగీతరావు, కృష్ణ, నలబోతుల హనుమంతరావు, సుదర్శనం, గేరా ఆదాం తదితరులు పాల్గొన్నారు.

లూథరన్ చర్చి ప్రతిష్ఠ


ముప్పాళ్ళ ఫిబ్రవరి 12: మండలంలోని నార్నెపాడులో గల శత వార్షిక లూథరన్ చర్చి ప్రతిష్ఠ వేడుకలు సోమవారం ఘనంగా జరి గాయి. చర్చిని ఏఈఎల్‌సీ గుంటూరు సెనడీ బిషప్ జోహాన్ బాబూరావు పాల్గొని రిబ్బన్ కట్‌చేసి చర్చిని ప్రతిష్ఠించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. లూథరన్ చర్చి ప్రతిష్ఠ కార్యక్రమంలో కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, గ్రామ సర్పంచ్ పోలూరి యలమంద, రావిపాటి దేవేంద్రరావు, పాతూరి పెంచలయ్య తదితరులున్నారు.

టీడీపీ, జనసేన గెలుపునకు కృషిచేయాలి

ముప్పాళ్ళ ఫిబ్రవరి 12: యువత టీడీపీ, జనసేన గెలుపునకు కృషి చేయాలని సత్తెనపల్లి టీడీపి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని అంకెలకూరపాడులో సోమవారం ఒక వివాహ కార్యక్రమంలో కన్నా పాల్గొని నూతన వధువును ఆశీర్వదించారు. అనంతరం టీడీపీ నాయకులతో గ్రామంలో పార్టీ పరిస్థితి, వివిధ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, నాయకులు క్రిస్టిపాటి రవీంద్రారెడ్డి, వెంకటరెడ్డి, క్రిస్టిపాటి సుబ్బారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, పి.పున్నారెడ్డి తదితరులున్నారు.

అరాచకపు పాలన రెండు నెలల్లో అంతం

● మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్



కోనూరులో మన ఇంటికి మన కొమ్మాలపాటి కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శ్రీధర్

క్రోసూరు, ఫిబ్రవరి 12 : రెండు నెలల కాలంలో రాష్ట్రంలో అరాచకపు పాలన అంతమవుతుందని, ఎటువంటి సందేహం లేదని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. సోమవారం ఆయన క్రోసూరులో పర్యటించారు. టీడీపీ నాయకులతోను, కార్యకర్తలతోను మాట్లాడారు. నాలుగు సంవత్సరాల పదినెలల కాలంలో రాష్ట్రంలో సామాన్య ప్రజల పరిస్థితి అన్ని విధాలుగా దిగజారి పోయిందన్నారు. నియంత పాలనను అంత మొందించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన కూటమి రికార్డు స్థాయిలో సీట్లు సాధించి అధికారంలోకి రావటం ఖాయమని ఆయన చెప్పారు. ఆయన వెంట టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నలజాల సదాశివరావు, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు దుద్దుల యోహాన్, మండల అధ్యక్షుడు గుడిపాడు బాషా, మాజీ ఎంపీపీ అనుముల వెంకట రామిరెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్లు కాంద్రు కాశయ్య, ఏపూరి నాగేశ్వరరావు, పార్టీ నాయకులు మన్నెం శ్రీనివాసరావు, దారెడ్ల సీతారెడ్డి, ఊరే రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబీలకు పరామర్శ

క్రోసూరులో ఇటీవల మరణించిన టీడీపీ బీసీ వర్గానికి చెందిన నాయకుడు వడ్లమూడి కృష్ణమూర్తి కుటుంబసభ్యులను కొమ్మాలపాటి శ్రీధర్ సోమవారం పరామర్శించారు. కృష్ణమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్సీ కాలనీలో మరణించిన చిలకా సైదమ్మ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బీసీలకు వెన్నుదన్నుగా టీడీపీ మాత్రమే నిలిచింది

అచ్చంపేట, ఫిబ్రవరి 12: రాష్ట్రంలో బీసీలకు వెన్నుదన్నుగా తెలుగుదేశం పార్టీయే నిలిచిందని కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. సోమవారం మండ లంలోని కోనూరులో మన ఇంటికి మన కొమ్మాలపాటి కార్యక్రమానికి కొమ్మాలపాటి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క అవకాశం అని పదవిలోకి వచ్చిన జగన్ బీసీలకు తీరని అన్యాయం చేశారన్నారు. సరైన ఆర్థిక ప్రణాళిక లేకుండా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసి బీసీలకు ఉపాధి అవకాశాలు లేకుండా చేసిన జగన్మోహన్‌రెడ్డికి రాబోవు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నంది గం ఆశీర్వాదం, గ్రామ అధ్యక్షుడు ఆవుల గురునాథం, తాళ్ళూరి లక్ష్మీనారాయణ, గోళ్ళమూడి చందు, అచ్యుత రామారావు, బత్తుల శ్రీనివాసరావు, వాసిరెడ్డి రవిచందు, ఎస్‌కే కాసుల తదితరులు పాల్గొన్నారు.

వినాయకుని గుడి నిర్మాణానికి భూమిపూజ

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 12: మండలంలోని కంభంపాడులో వినాయకుని గుడి, ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెల్లో ప్రశాంత వాతావరణం ఉండాలన్నారు. వివాదాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరికట్ల చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాప్టిస్టు చర్చి ప్రతిష్ఠలో పిన్నెల్లి సోదరులు

విజయపురిసౌత్, ఫిబ్రవరి 12: మాచర్ల మండలం బెల్లంకొండవారిపాలెం లో రూ.24 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన బాప్టిస్టు చర్చి ప్రతిష్ఠలో సోమవారం ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వైసీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలు పాల్గొన్నారు. ముందుగా గ్రామంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

టైలరింగ్ కోర్సులో ఉచిత శిక్షణ

నకరికల్లు, ఫిబ్రవరి 12: ఉమెన్స్ టైలరింగ్ కోర్సులో మహిళలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ జీబీ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలకు ఉచిత శిక్షణతో పాటు ఉచిత భోజన సదుపాయం, ఉచిత హాస్టల్ వసతి కల్పించనున్నట్లు తెలిపారు. 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వారు ఈ శిక్షణకు అర్హులన్నారు. ఆసక్తి గల మహిళలు తెల్లరేషన్ కార్డు జిరాక్స్ కాపీ, ఆధార్ జిరాక్స్ కార్డు కాపీ, నాలుగు పాస్ పోర్టు సైజు ఫోటోలతో గుంటూరు కొత్తపేట ఓల్డ్ బ్యాంక్ స్ట్రీట్‌లోని యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ, డోర్ నెంబరు 14-1-14లో సంప్రదించాలని సూచించారు. వివరాలకు 9700687696, 8125397953, 99499 30155 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఈనెల 16వ తేదీ నుంచి నెల రోజుల పాటు శిక్షణ కొనసాగుతుందని తెలిపారు.

సాంబయ్య మృతి బాధాకరం

రాజుపాలెం, ఫిబ్రవరి 12: మండలంలోని నెమలిపురి గ్రామానికి చెందిన బత్తుల సాంబయ్య(67) సోమవారం మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందినట్లు తెలుసుకున్న నియోజకవర్గ తెలుగుదేశం, జనసేన పార్టీ ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ తనయుడు నాగరాజు గ్రామంలోని సాంబయ్య ఇంటికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మొక్కపాడు గ్రామ సర్పంచ్ కణదం శ్రీను, మాజీ ఎంపీపీ గుత్తా వెంకట్రావు, పార్టీ నాయకులు గంగవరపు రామ లక్ష్మణరావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు శనగపూల వెంకయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు నల్లగొర్ల నరసింహారావు, వేపూరి రామయ్య తదితరులు ఉన్నారు.

అశ్రునయనాల మధ్య సత్యం అంత్యక్రియలు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 12: మండలంలోని ధూళిపాళ్ళ మాజీ సర్పంచ్ చిలకా సత్యం అంత్యక్రియలు సోమవారం టీడీపీ, జనసేన కార్యకర్తలు, నాయకులు, కుటుంబసభ్యులు, బంధువులు, శ్రేయాభిలాషుల అశ్రునయనాల మధ్య జరిగాయి. గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు, టీడీపీ ఎస్సీ సెల్ నేతలు, జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త బొర్రా వెంకట అప్పారావు, నియోజకవర్గానికి చెందిన పలువురు జన సైనికులు చిలకా సత్యం మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల్లో బొర్రా వెంకట అప్పారావు చిలకా సత్యం శవ పేటికను మోశారు. ఆయన మరణం బాధాకరమని టీడీపీ, జనసేన నేతలు అన్నారు.

తహసీల్దార్‌గా పి.సింగారావు బాధ్యతల స్వీకారం



పి.సింగారావు

ముప్పాళ్ళ ఫిబ్రవరి 12: ముప్పాళ్ళ తహసీల్దార్‌గా పి.సింగారావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పరిపాలనాధికారిగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వచ్చారు. ముప్పాళ్ళలో తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన ఎం భవానీశంకర్ ఎన్నికల బదిలీలలో భాగంగా ప్రకాశం జిల్లా వెళ్లారు.

సీఐగా రాజేష్ బాధ్యతల స్వీకరణ

సత్తెనపల్లి, ఫిబ్రవరి 12 : సత్తెనపల్లి రూరల్ పోలీసుస్టేషన్ సీఐగా రాజేష్ సోమవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఎన్నికల బదిలీల్లో భాగంగా ప్రకాశం జిల్లా కంభం సర్కిల్ నుంచి బదిలీపై సత్తెనపల్లి రూరల్ పోలీసు స్టేషన్‌కు వచ్చారు.

బెల్లంకొండ నూతన ఎస్ఐగా ఎస్ రాజేష్




ఎస్ఐ రాజేష్

బెల్లంకొండ, ఫిబ్రవరి 12: బెల్లంకొండ నూతన ఎస్ఐగా ఎస్ రాజేష్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో నరసరావుపేట ఎస్‌బీ ఎస్ఐగా పని చేస్తూ బదిలీపై బెల్లంకొండకు రావటం జరిగింది. ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ అమీర్ పిడుగురాళ్ళ టౌన్ ఎస్ఐగా బదిలీపై వెళ్లారు.

రాజుపాలెం ఎస్ఐగా సమీర్ బాషా

రాజుపాలెం, ఫిబ్రవరి 12: రాజుపాలెం నూతన ఎస్ఐగా సయ్యద్ సమీర్ బాషా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు మాచవరం పోలీస్‌స్టేషన్‌లో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన సమీర్ బాషా సోమవారం రాజుపాలెం ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు.

మాచవరం ఎస్ఐగా అమీనుద్దీన్



ఎస్ఐ అమీనుద్దీన్

మాచవరం, ఫిబ్రవరి 12: మాచవరం మండల నూతన ఎస్ఐగా అమీనుద్దీన్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. సత్తెనపల్లి టౌన్ ఎస్ఐగా పనిచేస్తూ ఎన్నికల బదిలీల్లో భాగంగా మాచవరం ఎస్ఐగా నియమితులయ్యారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ సమీర్‌బాషా రాజుపాలెం ఎస్ఐగా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్ఐ అమీను ద్దీన్ మాట్లాడుతూ రానున్న సాధారణ ఎన్నికలలో సమర్థవంతంగా పనిచేసి ఎన్నికలు సజావుగా జరిగే విధంగా విధులు నిర్వర్తిస్తానని తెలిపారు.

ఇంటింటికి కాంగ్రెస్ పార్టీ గ్యారంటీల ప్రచారం

వెల్దుర్తి, ఫిబ్రవరి 12: మండలంలోని పిచ్చయ్యబావితండా, లోయపల్లి, దావుపల్లి, సేవానాయక్‌తండా, వజ్రాలపాడుతండా గ్రామాల్లో సోమవారం కాంగ్రెస్ పార్టీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి ఇంటింటికి కాంగ్రెస్ పార్టీ గ్యారంటీల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను వివరించారు. పిచ్చయ్యబావితండాకు రహదారి మార్గం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వంగపాటి నాగరాజు, నాసర్‌వలి, దిబ్బయ్య, కోటి తదితరులు పాల్గొన్నారు.

నేడు మైనారిటీల ఆత్మీయ సదస్సు

● సదస్సు ప్రాంగణాన్ని పరిశీలించిన యరపతినేని



సదస్సు జరిగే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న యరపతినేని శ్రీనివాసరావు, మైనారిటీలు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 12: గురజాల నియోజకవర్గ స్థాయి ముస్లిం మైనారిటీల ఆత్మీయ సదస్సు మంగళవారం సాయంత్రం స్థానిక కాకతీయ కల్యాణ మండపం సమీపంలో జరుగనున్నదని మైనారిటీ రాష్ట్ర నాయకులు షేక్ బాబావలి, అమీర్‌అలి, చింతపల్లి హసన్ అహ్మద్, చికెన్ బాషా తెలిపారు. అధికారంలో ఉన్నా లేకున్నా యరపతినేని ముస్లిం మైనారిటీలకు అండగా ఉంటున్న విషయాన్ని గుర్తుచేయడంతో పాటు హజ్‌యాత్రకు వెళ్లే వారికి లక్ష రూపాయలు చొప్పున 45మందికి అందించిన ఆర్థిక సాయాన్ని ఎన్నటికీ మరువలేమని గుర్తుచేశారు. రేపటి ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి వెన్నుదన్నుగా ఉంటూ గురజాలలో మరోసారి యరపతినేని శ్రీనివాసరావును గెలిపించేందుకు సన్నద్ధంగా ఉన్నామని వారు పేర్కొన్నారు. మంగళవారం జరిగే ముస్లిం మైనారిటీల ఆత్మీయ సమావేశం మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరుగనున్నదని, సుమారు 3వేల మందికి పైగా మైనారిటీలు హాజరుకానున్న ప్రాంగణాన్ని సోమవారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పరిశీలించారు. ఆయన వెంట పాండురంగ శ్రీను, బాబావలి, వడ్డవల్లి సర్వేశ్వరరావు, అమీర్‌అలి, ఫరీద్‌మేస్త్రీ, ఖాశింసైదా, కామిశెట్టి రమేష్, డాక్టర్ వలి, వడ్డవల్లి సాంబశివరావు, షేక్ అబ్దుల్లా, ముజీబ్, మస్తాన్‌వలి, సైదా, సుభాని, ఇర్షాద్, తదితరులున్నారు.

వెంకట్ కుటుంబానికి అండగా ఉంటా

రోడ్డు ప్రమాదంలో తురకా వెంకట్ మృతి చెందడం బాధాకరమని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం రాత్రి పిడుగురాళ్లలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకట్ మృతి చెందగా సోమవారం సాయంత్రం కోనంకి గ్రామంలో తురకా వెంకట్ మృతదేహానికి నివాళులర్పించిన అనంతరం తండ్రి శ్రీనివాసరావును, కుటుంబసభ్యులను పరామర్శించి కుటుంబానికి అండగా వుంటానని, ఏ అవసరం వచ్చినా తనవద్దకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తురకా వీరస్వామి, నందిపాటి శ్రీనివాసరెడ్డి, దగ్గుల వెంకటేశ్వరరెడ్డి, సుబ్బారెడ్డి, దేరంగుల ఆంజనేయులు, తురకా సురేష్, మేకల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం బలోపేతానికి కృషి చేయాలి

సత్తెనపల్లి, ఫిబ్రవరి 12: పల్నాడు జిల్లా ఆర్యవైశ్య సంఘం బలోపేతానికి సంఘంలో పదవులు పొందిన నేతలు కృషి చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీనివాసరావు, ఆర్యవైశ్య నేతలు అన్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థాన కళ్యాణ మండపంలో పల్నాడు జిల్లా ఆర్యవైశ్య సంఘంలో వివిధ పదవులు పొందిన ఎనిమిది మంది ఆర్యవైశ్య నేతలను చౌట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సన్మానించారు. వారిలో దివ్వెల శ్రీనివాసరావు, బాలనాగు శివకోటేశ్వరరావు, దేవతి శివప్రసాదు, జవ్వాజి రామ్మోహనరావు, పోతుగంటి నరసింహారావు, తవ్వా హరనాథ్, కటకం వెంకట సాయి రమేష్, కొప్పురావూరి కాశీ, కటకం రామకృష్ణ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పలువురు ఆర్యవైశ్య నేతలు పాల్గొన్నారు.

ఎస్సీలకు విద్య, సంక్షేమం, అందించిన ఘనత టీడీపీదే

అచ్చంపేట, ఫిబ్రవరి 12: మండలంలోని తాళ్ళచెరువు గ్రామంలో సోమవారం మన ఇంటికి మన కొమ్మాలపాటి కార్యక్రమం జరిగింది. టీడీపీ, జనసేన అజెండాలను ఇంటింటికి వెళ్ళి ప్రచారం నిర్వహించి వాల్ పోస్టర్లను గోడలకు అంటించారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ అనే పథ కాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, బత్తుల శ్రీనివాసరావు, ఇన్నారెడ్డి, రేపూడి తోమాస్, నేలగిరి రామరాజు, తిరువాయిపాటి ఆంజనేయులు, తుపాకుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

● సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి

కారంపూడి, ఫిబ్రవరి 12: చేసిన వాగ్దానాలు అమలు పరచకపోగా కేంద్ర ప్రభుత్వ ఆస్తులను అమ్మకాలకు పెట్టిన మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మేకపోతు శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కారంపూడిలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యువతకు కోటి ఉద్యోగాలు ఇప్పిస్తానని ప్రధాని మోదీ దగా చేశారన్నారు. రాజధాని నిర్మాణంలో సాయపడతానని చెప్పి అమరావతి రాజధానికి మొండి చేయి చూపారన్నారు. పలు సమస్యల పరిష్కారం కోసం ఈనెల 16వ తేదీన నిర్వహించనున్న భారత్‌బంద్‌లో అందరూ పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐఎంఎల్ జిల్లా కార్యదర్శి ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, సీపీఐ మండల కార్యదర్శి షేక్ సైదా, రైతు కూలీ సంఘం జిల్లా నేత జక్కంపూడి పద్మ, కాంగ్రెస్ పార్టీ నేత నాగేటి కొండలు, సీపీఐ మండల సహాయ కార్యదర్శి కూరాకుల వెంకటశివయ్య, సుబ్బారావు, శ్రీనివాసరెడ్డి, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా వార్తల్లో ఎటువంటి నిజం లేదు

● నియోజకవర్గ స్థాయి టీడీపీ నాయకులు

క్రోసూరు, ఫిబ్రవరి 12: కొమ్మాలపాటి అభ్యర్థిత్వం విషయంలో కొంత మంది పని గట్టుకొని వ్యతిరేక ప్రచారం చేస్తున్నారని, సోషల్ మీడియా వార్తల్లో ఎటువంటి నిజం లేదని పలువురు జిల్లా, నియోజకవర్గ స్థాయి టీడీపీ నాయకులు వెల్లడించారు. క్రోసూరులోని టీడీపీ కార్యాలయంలో సోమవారం వారు విలేక రులతో మాట్లాడుతూ టీడీపీ అధిష్టానానికి కొమ్మాలపాటిపై పూర్తి నమ్మకం ఉందని, నియోజకవర్గంలోని పార్టీ క్యాడర్ మొత్తం కొమ్మాలపాటి వెంటే ఉందని వారు తెలిపారు. ఎమ్మెల్యేగా ఉన్నా లేకపోయినా గడిచిన ఐదు సంవత్సరాల కాలంలో ప్రజల పక్షాన అనేక పోరాటాలు చేశారని, కష్టమొచ్చినా, నష్టమొచ్చినా ప్రజలకు అండగా ఉన్నారని, అటువంటి అభ్యర్థి కొమ్మాలపాటిని తప్పనిసరిగా గెలిపించుకుంటామని వారు తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నలజాల సదాశివరావు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఏపూరి నాగేశ్వరరావు, కాంద్రు కాశయ్య, విప్పర్ల మాజీ సర్పంచ్ కొండవీటి శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు గుడిపాడు బాషా, ఎస్సీ సెల్ నాయకులు దుద్దుల యోహాన్, బీసీ సెల్ నాయకులు ఊరే రోశయ్య తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరం

విజయపురిసౌత్, ఫిబ్రవరి 12: మండలంలోని బ్రహ్మానందపురంతండాలో విజయపురిసౌత్ ఏపీఆర్‌డీసీ ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సేవా శిబిరం కొనసాగుతోంది. సోమవారం గ్రామంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ముళ్ల కంపలను తొలగించారు. పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీ లు జరిపారు. ఈ శిబిరంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ శిబిరాన్ని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ రవిశంకర్, కళా శాల ప్రిన్సిపాల్ వైఎస్ఎస్ చౌదరి, కార్యనిర్వాహకుడు మహ్మద్‌బాషా పర్యవేక్షిస్తున్నారు.

గంగాభవాని ఆలయ 27వ వార్షికోత్సవం

రెంటచింతల, ఫిబ్రవరి 12: రెంటచింతలలోని గంగా భవాని అమ్మవారి ఆలయ 27వ వార్షిక వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పల్లెర్ల వంశీకులకు అమ్మవారు ఇలవేల్పు. ఆలయపూజారి శ్రీనివాసశర్మ నేతృత్వంలో వేకువజాము నుంచే సుప్రభాతసేవ, అభిషేకాలు, అమ్మవారికి మూల మంత్ర హోమాలు, కుంకుమార్చనలు చేశారు. భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

15వ ఆర్థిక సంఘం నిధులు తాగునీటికే ఉపయోగించాలి

అచ్చంపేట, ఫిబ్రవరి 15 : 15వ ఆర్థిక సంఘం నిధులు తాగు నీటికి మొదట ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీవో అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ భూక్యా రజినీబాయి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అధికారులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో ఉన్న మంచి నీటి సంపుల్లో ఇసుకను మార్చాలని, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శేషప్పయ్య సర్పంచులను కోరారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సభ్యులు తుమ్మా విజయ ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చించివేసిన వైసీపీ ఫ్లెక్సీ, పూర్తిగా తొలగించిన టీడీపీ ఫ్లెక్సీలు

వైసీపీ, టీడీపీ ఫ్లెక్సీల చించివేత

● పల్నాడు రోడ్డు వేదికగా రాజకీయ వివాదాలు

నరసరావుపేట, ఫిబ్రవరి 12: పట్టణంలో ఇరు పార్టీల మధ్య ఫ్లెక్సీల రగడ జరుగతోంది. ఒక పార్టీ చెందిన ఫ్లెక్సీలను మరో పార్టీకి చెందిన వ్యక్తులు చించివేస్తుండం రాజకీయ వివాదాలు దారితీస్తోంది. పల్నాడు రోడ్డు వేదికగా ఫ్లెక్సీల వివాదం సాగుతోంది. వైసీపీ ఎంపీ అభ్యర్థి పల్నాడు రోడ్డులో తన కార్యాలయం ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ఎన్‌జీవో కాలనీ రహదారిలో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు చించేశారు. దీంతో తెలుగుదేశం వారు ఎన్‌జీవో కాలనీ వద్ద ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను కూడా గుర్తు తెలియని వ్యక్తులు చించేశారు. ఎన్‌జీవో కాలనీ రహదారి ఆర్చ్‌కి ఏర్పాటుచేసిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కార్యాలయం అని ముద్రించిన ఫ్లెక్సీని తెలుగుదేశం వారు ఏర్పాటు చేశారు. దీని కూడా ఆదివారం రాత్రి తొలగించారు. ఎంపీ కృష్ణదేవరాయలు, వైసీపీ ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ ఇద్దరి కార్యాలయాలు అత్యంత సమీపంలో ఉన్నాయి. వీరి కార్యాలయాలకు దారి కూడా ఒకే రహదారి కావడంతో రానున్న రోజుల్లో ఎటువంటి పరిస్థితులు నెలకొంటాయోమనన్న ఆందోళన ఆ ప్రాంత వాసుల్లో నెలకొంది.



పల్నాడు రోడ్డులో ప్రైవేట్ వ్యక్తులు నిర్మించిన డివైడర్

డివైడర్ తొలగించారు.. మరోచోట నిర్మించారు

● చోద్యం చూస్తున్న మునిసిపల్ అధికారులు

నరసరావుపేట, ఫిబ్రవరి 12: అధికారం చేతిలో ఉంటే ఏదైనా చేయవచ్చని వైసీపీ నేతలు చాటి చెబుతున్నారు. పట్టణంలోని పల్నాడు రోడ్డులో ఉన్న డివైడర్‌ను ఎటువంటి అనుమతులు లేకుండానే అధికార పార్టీ వ్యక్తులు తొలగించివేశారు. వారికి అనుకూలంగా ఉండేలా తిరిగి మరో ప్రాంతంలో డివైడర్ నిర్మించారు. మునిసిపాల్టీకి సంబంధించిన ఆస్తిని ధ్వంసం చేసినా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. డివైడర్ తొలగింపు, నిర్మాణం తమకు తెలియదని అధికారులు చెబుతుండటం గమనార్హం. అంటే పట్టణంలో అధికారులు పర్యవేక్షణ లేదని వారి పనితీరు తెలియజేస్తోంది. డివైడర్ తొలగింపుపై ఇంజనీరింగ్ విభాగాన్ని విచారించి నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్టు కమిషనర్ రామ్మోహనరావు తెలిపారు.

ఎట్టకేలకు యంత్రం రోడ్డెక్కింది

● పూడిన పైపుల శుభ్రం ● మురుగునీటి సమస్య పరిష్కారం

ఎఫెక్ట్



పల్నాడు రోడ్డులో పైప్‌లైన్ క్లీన్ చేస్తున్న యంత్రం

నరసరావుపేట, ఫిబ్రవరి 13: ఎట్టకేలకు భూగర్భ డ్రైనేజీ పైపులను క్లీన్‌చేసే యంత్రం రోడ్డెక్కింది. మురుగుపై మొద్దు నిద్ర అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంపై మునిసిపల్ అధికారులు స్పందించారు. పూడిపోయిన పైపులను శుభ్రపరిచారు. పల్నాడు రోడ్డులోని అన్న క్యాంటీన్, అరండల్‌పేటలోని పైప్‌లైన్‌లను క్లీన్ చేశారు. దీంతో ఆ ప్రాంతంలోని మురుగునీటి సమస్యలు పరిష్కారం అయ్యాయి.



ప్రత్యేక అలంకరణలో కల్యాణ వేంకటేశ్వర స్వామి, కళ్యాణోత్సవం నిర్వహిస్తున్న పండితులు

వైభవంగా కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

నరసరావుపేట అర్బన్, ఫిబ్రవరి 12: నరసరావుపేట పట్టణంలోని మునిసిపల్ కార్యాలయ ప్రాంగణంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ 10వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారికి, పంచామృతాభిషేక పూజలను అర్చకులు చతుర్వేదుల భ్రమరకుమార్ నిర్వహించారు. అనంతరం స్వామివారికి విశేష అలంకరణ చేశారు. స్వామివారిని భక్తులు దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఆవరణలో శాంతి కల్యాణం జరిగింది. కార్యక్రమంలో దంపతులు పాల్గొన్నారు. సాయంత్రం భజనా కార్యక్రమాలను, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 12: నరసరావుపేట పట్టణంలోని పట్టాభిరామ స్వామి ఆలయంలోని వెంకటేశ్వర కళ్యాణ మండపంలో పల్నాడు జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకారం ఘనంగా జరిగినట్లు అధ్యక్షుడు అత్తులూరి సుబ్బారావు సోమవారం తెలిపారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్, డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ముఖ్యఅతిథులుగా అంబికా కృష్ణ, మహాసభ గౌరవ అధ్యక్షుడు జయంతి వేంకటేశ్వర్లు, మహాసభ అధ్యక్షుడు చిన్నిరామ సత్యనారాయణ, కాళ్ళకూరి నాగబాబు, పెనుగొండ సుబ్బారాయుడు, వాసవి సత్ర సముదాయాల అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, నరసరావుపేట మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బారాయగుప్తా, కపలవాయి విజయకుమార్ హాజరయ్యారు. జిల్లా ఆర్యవైశ్య సంఘ నూతన అధ్యక్షుడిగా అత్తులూరి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా కొత్తూరి ప్రదీప్, కోశాధికారిగా సెగు రమేష్, అదనపు ప్రధాన కార్యదర్శిగా పెరుమాళ రాజేష్, చీఫ్ ఆర్గనైజర్‌గా తాడువాయి రామకృష్ణ, కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. వివిధ జిల్లాల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు, పల్నాడు జిల్లాలలోని ఆర్యవైశ్య నాయకులు, అధిక సంఖ్యలో హాజరయ్యారు.

29మంది కృష్ణవేణి విద్యార్థులకు ఉద్యోగాలు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 12: కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు 29 మంది హైదరాబాద్‌కు చెందిన క్యూ-స్పైడర్స్ ఐటీ కంపెనీకి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ నాతాని వెంటేశ్వర్లు సోమవారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.3లక్షల వేతనం అందజేస్తారన్నారు. ఎంపికైన విద్యార్థులకు అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ యేగేశ్వరరావు, టీపీవో బాలకోటేశ్వరరావు, అధ్యాపకులు అభినందించారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా లక్ష్మీకుమారి

రొంపిచర్ల, ఫిబ్రవరి 12: రొంపిచర్ల మండల ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా సీహెచ్‌వీ లక్ష్మీకుమారి సోమవారం విధుల్లో చేరారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేస్తున్న మాధ్యూబాబు ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. కృష్ణా జిల్లా నుంచి ఇక్కడికు రావాల్సిన ఎంపీడీవో అనివార్య కారణాల వల్ల విధుల్లో చేరకపోవటంతో కార్యాలయ ఏవోగా పనిచేస్తున్న సీహెచ్‌వీ లక్ష్మీకుమారి ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా బాధ్యతలను తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను ఎంపీపీ గడ్డం బాలనాగమ్మ, ఎస్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో ప్రసాదు తదితరులు అభినందించారు. కార్యక్రమంలో గడ్డం వెంకటరావు, స్వచ్ఛ భారత్ మిషన్ కో-ఆర్డినేటర్ మేడికొండ సుబ్బారెడ్డి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

● ఎస్పీ రవిశంకర్‌రెడ్డి



ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 12: జగనన్నకు చెబుదాం స్పందన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని పల్నాడు జిల్లా ఎస్పీ వై రవి శంకర్‌రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో స్పంద న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన పాల్గొని బాధితుల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. చిలకలూరిపేట పట్టణానికి చెందిన మహిళ తనకు తెలిసిన మరొక మహిళకు సంవత్సరం క్రితం రూ.12 లక్షలు ఇవ్వగా ఆరు నెలల్లో ఇస్తానని చెప్పి ఆమె రూ.4.50 లక్షలు ఇచ్చి మిగతా డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతోందని, న్యాయం చేయాలని ఫిర్యాదు చేసింది. సత్తెనపల్లి పట్టణానికి చెందిన యక్కల వెంకట రామారావు ఏడు సంవత్సరాల క్రితం తెలిసిన వ్యక్తికి వ్యక్తిగత అవసరాల నిమిత్తం రూ.10లక్షలు ఇచ్చినట్టు, తరువాత సదరు వ్యక్తి డబ్బులు ఇవ్వకుండా దాడికి యత్నించి, బెదిరించాని తగున్యాయం చేయాలని ఎస్పీని ఆశ్రయించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు రాఘవేంద్ర, రామచంద్రరాజు, డీఎస్పీలు పల్లపు రాజు, వర్మ, గురునాథ్, సర్‌ఫుద్దీన్, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ని అక్రమ కేసులు పెట్టినా భయపడేది లేదు

● ప్రజల ఆస్తులు కాపాడటానికి ప్రాణాలు వదిలేయడానికైనా సిద్ధం

● టీడీపీ నియోజవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 12: ఎన్ని అక్రమ కేసులు పెట్టినా భయపడేది లేదని, ప్రజల ఆస్తులు కాపాడడానికి ప్రాణాలైనా వదిలేయడానికి సిద్ధమని టీడీపీ నియోజవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. సోమవారం టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం జరిగింది. డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ మొదట సాయి బాలాజీ వెంచర్‌కి తనకు సంబంధం లేదని చెప్పిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రెస్‌మీట్‌లో మాత్రం వెంచర్ తనదేనని ఒప్పుకున్నారని అన్నారు. సాయి బాలాజీ వెంచర్‌లో 45 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు మాట్లాడుతుంటే ఎమ్మెల్యే ప్రభుత్వ భూమి లేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఎమ్మెల్యే ప్రభుత్వ భూమిని ప్లాట్లుగా మార్చి పేదలకు అమ్ముకున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే అవినీతి, అక్రమాలను, కుటుంబ పాలనను భరించలేక వైసీపీ నాయకులే పార్టీ వదిలి పెట్టి పోతున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే అవినీతి అక్రమాలను బయటపెట్టిన ప్రతిపక్ష నాయకులపై, బలహీనవర్గాల ప్రజా నాయకులపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తున్నారని, ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదన్నారు. సాయి బాలాజీ వెంచర్‌లో ప్రభుత్వ భూమి 175 నుంచి 207 మధ్యలో ప్రభుత్వ భూమి, ఇనామ్ భూములు ఉన్నాయని చెప్తే ప్రభుత్వభూమే లేదని, అది ప్రైవేట్ వ్యక్తులదని చెప్తున్నారని, ఆ ప్రైవేట్ వ్యక్తులకు భూమి ఎలా వచ్చిందో చెప్పాలన్నారు. వెంచర్‌లో మొత్తం 45ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, 183 సర్వే నెంబర్‌లో 16.47 ఎకరాల ఇనామ్ భూమి, 207లో ఒక ఎకరం ప్రభుత్వ పోరంబోకు భూమి, నోషన్ ఖాతా ఇలా అన్ని కలిపి 45ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. తెలుగుదేశం పార్టీ చేసింది ఆరోపణలు కాదని, ఆధారాలతో సహా వాస్తవాలను మీడియా ముఖంగా తెలియజేశామని అన్నారు. దమ్ము, ధైర్యం ఉంటే అవినీతి చేయకపోతే సాయి బాలాజీ వెంచర్‌పై కలెక్టర్‌తో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వెంచర్‌లో చంద్రమౌళేశ్వరస్వామి దేవాలయ భూమి మూడున్నర ఎకరాలు ఉన్నాయని ఒప్పుకున్నారని, ఆ భూమి అడంగల్‌లో ఎలా నమోదు చేశారో ఎమ్మెల్యే చెప్పాలన్నారు. ఇనామ్ భూములకు పట్టాలు ఇచ్చారని ఎమ్మెల్యే తప్పుడు ఆధారాలు చూపుతున్నారని, ఇనామ్ భూములు ప్రైవేట్ వెంచర్లకు ఎలా కలుపుకున్నారో, ఆ భూములు ఎలా అమ్ముకున్నారో ఆ అధికారం ఎవరిచ్చారో చెప్పాలన్నారు. డాక్టర్ చదలవాడ అరవిందబాబు రాడ్డు లేకుండా ఆపరేషన్ చేశాడని గోపిరెడ్డి ఆరోపిస్తూ రాజకీయాల కోసం దిగజారి వైద్య వృత్తిని అవమానిస్తున్నారని డాక్టర్ చదలవాడ అన్నారు. రాడ్డు లేకుండా ఆపరేషన్ చేస్తే పేషెంట్ ఎలా నడుస్తాడని, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ఎంబీబీఎస్ చదవి డాక్టర్ అయ్యాడో, లేదా పట్టా కొనుక్కొని డాక్టర్ అయ్యాడో అర్థం కావడం లేదన్నారు. 40ఏళ్ళ నుంచి అమూల్యా నర్సింగ్ హోమ్‌లో కొన్ని లక్షల ఆపరేషన్లు చేసిన చరిత్ర ఉందన్నారు. ప్రభుత్వం నుంచి ఆరోగ్యశ్రీ డబ్బులను రూ.4కోట్లు రాకుండా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి అడ్డుకున్నారని, ఎన్ని కుట్రలు చేసినా పేద ప్రజలకు వైద్యం చేస్తానని డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు పులుకూరి జగ్గయ్య, పులిమి వెంకటరామిరెడ్డి, పుచ్చకాయల బసవేశ్వరరావు, కొక్కెర గంగాధర్, మోతాదు హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బారినుంచి నాయకులను, కార్యకర్తలను కాపాడుకుంటా

● వైసీపీ నాయకుడు గజ్జల బ్రహ్మారెడ్డి

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 12: ఎమ్మెల్యే బారి నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలను కాపాడుకుంటానని వైసీపీ నాయకుడు గజ్జల బ్రహ్మారెడ్డి తెలిపారు. నరసరావుపేట మండలం చింతలపాలెంలో వైసీపీ నాయకుడు గజ్జల బ్రహ్మారెడ్డి సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా గజ్జల బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి రోజురోజుకు అసమ్మతి సెగ పెరుగుతుందన్నారు. చింతలపాలెంలో జగనన్న లేఅవుట్ పేరుతో మాకు ఇచ్చిన భూములు ఎమ్మెల్యే లాక్కున్నాడని 30 కుటుంబాలు తనవద్ద ఆవేదన వ్యక్తం చేశారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీని గెలిపించేందుకు కార్యకర్తలు, నాయకులు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ హనీఫ్, జడ్పీటీసీ పిల్లి ఓబులరెడ్డి, నేలటూరి మురళి, గిల్లి బ్రహ్మారెడ్డి, వెన్న రవీందర్‌రెడ్డి, గుర్రం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సీపీఐ, సీపీఎం నాయకులు

బూటకపు శంకుస్థాపనలతో మోసం

● సీపీఐ, సీపీఎం నాయకుల ధ్వజం

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 12: వరికపూడిశెల ప్రాజెక్టు పనులు ప్రారంభించే ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదని, శంకుస్థాపన చేసి మూడు నెలలు గడుస్తున్నా నిధులు కేటాయించి పనులు ఎందుకు ప్రారంభించలేదని పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి మారుతివరప్రసాద్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఏపూరి గోపాలరావు ప్రశ్నించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వరికపూడిశెల ప్రాజెక్టును గత సంవత్సరం నవంబరు 17న వర్చువల్‌గా శంకుస్థాపన చేసి పల్నాడు ప్రజలను నమ్మించారని, మూడు మాసాలు కావస్తున్నప్పటికీ ఇంతవరకు ఆ ప్రాజెక్టుకు సంబంధించిన నిర్మాణ పనులు ప్రారంభించలేదన్నారు. వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణం కోసం నిధుల కేటాయింపు ప్రక్రియ పూర్తికానందున పనులు మొదలుకాలేదని రెవెన్యూ అధికారులు తెలిపారన్నారు. ఎన్నికల కోడ్ వస్తే ఆ ప్రాజెక్టును మొదలుపెట్టబోరని అర్థమవుతుందని అన్నారు. వెల్దుర్తి, దుర్గి, బొల్లాపల్లి తదితర మండలాల ప్రజలను నమ్మించి జగన్‌మోహన్‌రెడ్డి ఆడిన నాటకమని, ఎన్నికల్లో ఓట్లు పొందడం కోసం మాచర్ల, వినుకొండ శాసనసభ్యులు చేస్తున్న బూటకపు శంకుస్థాపనలు అని వారు విమర్శించారు. కార్యక్రమంలో ఉలవలపూడి రాము, రామాంజి నాయక్, హనుమంతరెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలసిన పలువురు పోలీసు అధికారులు

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 12: పల్నాడు జిల్లా ఎస్పీ వై రవి శంకర్‌రెడ్డిని పలువురు పోలీసు అధికారులు సోమవారం ఆయన కార్యాలయంలో కలశారు. ఇటీవల బదిలీపై జిల్లాకు వచ్చిన క్రైం ఏఎస్పీ సీహెచ్ లక్ష్మీపతి, నరసరావుపేట డీఎస్పీ వర్మ, రాజుపాలెం ఎస్ఐ సమీర్ బాషా, బెల్లంకొండ ఎస్ఐ రాజేష్, మాచవరం ఎస్ఐ అమీనుద్దీన్‌లు ఎస్పీని మర్యాద పూర్వకంగా కలసి పూల మొక్కలు, పుష్పగుచ్ఛాలు అందజేశారు.

ఢిల్లీ గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న ఎన్‌సీసీ ఆఫీసర్, క్యాడెట్‌కు సత్కారం

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 12: ఇటీవల ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకలలో ఎస్ఎస్ఎన్ కళాశాల ఎస్ఎస్ఎన్ కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ బీఎస్ఆర్‌కే రాజు, క్యాడెట్ కే ఏడుకొండలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో వారిని కళాశాల యాజమాన్యం సోమవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బారాయుగుప్తా, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మల్లయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్‌ఎంఎస్ సుధీర్, కే.మోహన్‌రావు, డాక్టర్ పీఎస్‌వీడీ మహేష్, ఐ.సదాశివరెడ్డి, రాంబాబు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో వాగ్దేవి విద్యార్థుల ప్రతిభ

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 12: ఏఎన్‌యూ పరీక్షా ఫలితాలలో వాగ్దేవి డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ కపలవాయి రాజేంద్రప్రసాద్ సోమవారం తెలిపారు. బీఎస్సీ ఎపీసీలో జీ నాగకుసుమ 700/750, బీ ప్రవల్లిక 692/750, ఎస్‌కే మాలిస్ 691/750, ఎంఎస్‌సీఎస్‌లో ఎం లక్ష్మీప్రసన్న 683/750, పీ ప్రవల్లిక 675/750, జీ హరివెంకట నాగ సుస్మిత 662/750, బీకామ్‌లో ఏ రాజేశ్వరి 601/700, పీ రాజపుష్ప 600/700, వీ అనిత 599/700 మార్కులు సాధించారన్నారు. విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్లు, అధ్యాపకులు అభినందించారు.



కేక్ కట్ చేస్తున్న టీడీపీ యువనేత డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, కుమ్మెత కోటిరెడ్డి తదితరులు

200 రోజులు పూర్తి చేసుకున్న అన్న క్యాంటీన్

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 12: నరసరావుపేట పట్టణంలో పల్నాడు రోడ్డులో అన్న క్యాంటీన్ టీడీపీ డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్ సోమవారం 200రోజులు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ మాట్లాడుతూ పేదవాడి ఆకలితీర్చడం కోసం టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను అధికారంలోకి వచ్చిన వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి నిలిపివేయటం దుర్మార్గం అన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్‌లను ప్రారంభించి వైసీపీకి గుణపాఠం చెప్తామన్నారు. నరసరావుపేటలో ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్‌లో ప్రతిరోజు 500మందికి భోజనం అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు కుమ్మెత కోటిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్‌కుమార్, బీసీసెల్ అధ్యక్షుడు తిరుమలకొండ నరసింహారావు, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ మహమ్మద్ రఫీ, కొలికొండ కొండలు, కోటి, కడియాల తాండవకృష్ణ, ఉడతా రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన

నరసరావుపేట కల్చరల్, ఫిబ్రవరి 12: పట్టణంలోని సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాలలో నేడు జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ మనక్, పల్నాడు జిల్లా విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించనున్నట్లు జిల్లా సైన్స్ సమన్వయ కర్త ఎఎ మధుకుమార్ సోమవారం తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ఈ ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. జిల్లా స్థాయిలో ఎంపికైన 126 మంది విద్యార్థుల ప్రాజెక్టులను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



విరాళం చెక్కును అందజేస్తున్న దాతలు, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి తదితరులు

మహంకాళి ఆలయానికి రూ.10 లక్షల విరాళం

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 12: మండలంలోని ఇసప్పాలెంలోని మహంకాళి ఆలయ పునఃనిర్మాణ పనులకు పలువురు విరాళాలు అందజేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ తరపున ప్రెసిడెంట్ నిడమానూరి సురేంద్ర రూ.5లక్షలు, వైస్ ప్రెసిడెంట్ ఆత్మకూరి రాజేంద్ర ప్రసాద్ రూ.2.5 లక్షలు, సభ్యులు కూరపాటి వెంకట అమరలింగేశ్వరరావు రూ.2.5 లక్షలు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి చేతుల మీదుగా ఆలయ కార్యనిర్వహణ అధికారి టి.సుధాకరరెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొత్త సాంబశివరావు, సభ్యులు కె.వెంకట బదరీనారాయణ, బి.సుబ్రమణ్యేశ్వరరావు, ఎన్.మాధవీదేవి, ఎ.ప్రసాదరావు, డి.రజని, ఎ.శ్రీనివాసరావు, ఎ.అలివేలమ్మ, ఎం.అలివేలు, ఎన్.కాళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌వోల సమావేశం

నూజెండ్ల, ఫిబ్రవరి 12: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ ఎండీ నయూం అహమ్మద్, డిప్యూటీ తహసీల్దార్ ఎం.అర్జున్ నాయక్‌లు బీఎల్‌వోల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా, చేర్పులు, మార్పుల విషయంలో ఓటర్లకు, రాజకీయ నాయకుల అనుమానాలు నివృత్తిచేసి ఓటర్ల జాబితా పారదర్శకంగా, తప్పులు లేకుండా ఉండేలా చూడాల్సిన బాధ్యత బీఎల్‌వోలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఆర్ఐ రామారావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పల్లెకు పోదాం

నూజెండ్ల, ఫిబ్రవరి 12: మండలంలోని గుర్రపునాయుడుపాలెం, ఉప్పలపాడు గ్రామాల్లో సోమవారం బీజేపీ నాయకులు పర్యటించి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు ఎండ్లూరి వీరయ్య, పల్నాడు జిల్లా యువమోర్చా ఉపాధ్యక్షుడు జెడ్డా లక్ష్మీనారాయణ, నూజెండ్ల మండల అధ్యక్షుడు పి.లక్ష్మీనారాయణ, శావల్యాపురం పార్టీ అధ్యక్షుడు ఊరేటి పేరయ్య తదితరులు పాల్గొన్నారు.



కళ్యాణి సెంటర్‌లో పేదలకు అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

ప్రత్తిపాటి ఫౌండేషన్ అన్నదానం

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 12: పట్టణంలో కళ్యాణి సెంటర్‌లో ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేస్తున్న అన్న క్యాంటీన్ సేవలు కొనసాగుతున్నాయి. సోమవారం 642మంది నిరు పేదలు, యాచకులకు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో షేక్ వశిం, షేక్ కరీం, తూబాడు సుభానీ, షేక్ ఉమర్, షేక్ ఖాజా, బొప్పుడి కరిముల్లా, ఖాజావలి, మస్తాన్‌వలి, అన్వర్, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, జవ్వాజి బుచ్చిబాబు తదితరులు స్వచ్ఛందంగా సేవలందిస్తున్నారు.

ధాన్యం బకాయిలు ఎప్పుడు ఇస్తావు జగన్?

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



భవిష్యత్ గ్యారెంటీ రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 12: కోట్ల రూపాయల కొద్దీ పేరుకు పోయిన ధాన్యం బకాయిలను ఎప్పుడు ఇస్తారో చెప్పాలని మాజీ మంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పసుమర్రు గ్రామంలో ఆదివారం రాత్రి బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న ప్రత్తిపాటి ఇంటింటికి వెళ్ళి కరపత్రాలను పంపిణీ చేసి టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం నిర్వహించిన ప్రజా వేదిక సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌కు సంబంధించి 22 రోజులు దాటినా చెల్లించని బకాయిలు మొత్తం పల్నాడు జిల్లాలో రూ.7కోట్ల వరకు ఉన్నాయని, ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా అది మరింత పెద్ద మొత్తంలో ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులకు దిక్కెవరని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మి ఏటా డబ్బుల కోసం ఎదురు చూడటం ఐదు సంవత్సరాలుగా పరిపాటిగా మారిందన్నారు. ఇదేనా రైతులపై జగన్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అని ప్రశ్నించారు. అభివృద్ధి, సంక్షేమం కోసం పాటుపడే టీడీపీకి ఓటు వేయాలని ఆయన కోరారు. జగన్ ఫేక్ సంక్షేమ ప్రచారం నమ్మిన వారందరికీ మిగిలినవి కష్టాలు, కన్నీళ్ళేనన్నారు. విత్తు నుంచి కొనుగోళ్ళ వరకు రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పి ఐదు సంవత్సరాలుగా వారి ఉసురుతీస్తున్న తీరే ఇందుకు నిదర్శనం అన్నారు. జగన్ మార్క్ మోసానికి, డ్వాక్రా మహిళలకు జరుగుతున్న అన్యాయం మరో మచ్చుతునక అన్నారు. గత నెల 23న నాల్గో విడత వైఎస్ఆర్ ఆసరా నగదు జమ చేస్తున్నట్టు ప్రకటించి బటన్ నొక్కినా ఇంతవరకు స్వయం సహాయక పొదుపు సంఘాల మహిళలకు వారి ఖాతాల్లో ఆ డబ్బులు ఎందుకు జమ కాలేదో చెప్పాలన్నారు.

ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆర్థికసాయం

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 12: పట్టణంలోని 32వ వార్డు ఆంజనేయ స్వామి వెనుక బజారులో బాణావత్ సురేష్ నాయక్ ఆదివారం మరణించాడు. వారి కుటుంబాన్ని టీడీపీ నాయకులు సోమవారం పరామర్శించారు. కుటుంబానికి ప్రత్తిపాటి ఫౌండేషన్ ద్వారా రూ.20వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బిట్ర శ్రీదేవి, అవ్వారు రమేష్, రాములు నాయక్, వేణు, అశోక్, దానేలు, శిరీష నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రేపు దేవాలయాల వార్షికోత్సవం

నాదెండ్ల, ఫిబ్రవరి 12: మండలంలోని చిరుమామిళ్ళ గ్రామంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి కాశీ విశ్వేశ్వరస్వామి వార్ల దేవాలయ ఐదో వార్షికోత్సవ వేడుకలు బుధవారం జరుగుతాయని నడికట్టు రామిరెడ్డి సేవా సమితి వారు తెలిపారు. గోల్కొండ గ్రూపు సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి పట్టు వస్త్రాల సమర్పణ, ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. ఈ సందర్భంగా అన్నదానం కూడా నిర్వహిస్తున్నట్టు వారు పేర్కొన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

వినుకొండటౌన్, ఫిబ్రవరి 12: మండలంలోని వెంకుపాలెం గ్రామపంచాయతీ భవనం నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సోమవారం శంకుస్థాపన చేశారు. అదేవిధంగా ఏనుగుపాలెంలో జలజీవన్‌మిషన్ పథకం పనులతో పాటు, పిట్టంబండ గ్రామంలో సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ సెంటర్లను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ కార్మికుల ధర్నా

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 12: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీల జీవోను వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు అన్నారు. నల్ల బ్యాడ్జీలు ధరించి మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలంటూ స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటీవల మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను జీవో రూపంలో విడుదల చేయాలని, లేనిపక్షంలో మళ్లీ సమ్మె చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు సంపెంగుల అబ్రహాం, పచ్చిగోర్ల ఏసు, రాచపూడి ఏసు, కంచర్ల కోటేశ్వరరావు, మందా ఇశ్రాయేలు, వెలుగొండ యోహోషువా, మార్తమ్మ, నాగరాణి, రాహేలమ్మ తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్యకాలనీలో మౌలిక వసతులు కల్పించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు, కాలనీవాసులు

వినుకొండ, ఫిబ్రవరి 12: పట్టణంలోని వెల్లటూరు రోడ్డులో ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న సుందరయ్య కాలనీ వాసులకు మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏపూరి గోపాలరావు విమర్శించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి బొంకూరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సుందరయ్య కాలనీ వాసులు సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన 20సంవత్సరాల నుంచి 250కుటుంబాలు సుందరయ్య నగర్‌లో నివాసం ఉంటున్నారని, కాలనీ వాసులు రాత్రి వేళల్లో చీకట్లో ఉండాల్సి వస్తుందని, చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లు మురికిమయంగా మారి స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కరెంటు సౌకర్యం లేక చీకట్లో మగ్గాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా కాలనీ వాసులు నిర్మించుకున్న ఇళ్లకు పట్టాలు మంజూరు చేయాలని మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు హనుమంతరెడ్డి, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, నవీన్‌కుమార్, నాసర్‌బీ, రామకృష్ణ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.